నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నమ్మలేని నిజాలు

పెద్దల గోల
వినాలి వదలాలి
మంచిని ఉంచు.

గజమాలలు
డాబు దర్పముండాలి
అర్హత హారం.

ఆకలి యుద్ధం
ఆక్రమణ దోపిడి
డాలర్ మహత్తు

కాలం గొలుసు
లింకుల అతుకులు
ఉండి ఊడవా!.

కాకర చేదు
నిష్ఠురం మరీచేదు
ఆరోగ్యధామం

– రేడియమ్
సెల్: 9291527757

నీనిజాలు

వినరండోయ్ ప్రజలారా
ఎఫ్ సి బిసి ఎస్ సి ఎస్టీ
పీల్చే గాలి మీద కూడ
కట్టాలిక జీ ఎస్టీ !

పాలు పెరుగు అల్లం బెల్లం
ఇదేమిటి పన్నుల బరువు ?
కట్టలేక చావలేక
గుండె అవుతుందోయ్ చెరువు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 21-7-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 284 | పేజీలు:6 | వెల: రూ.1/-

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుంది-ఈదురు రాజేశ్వరి ఎంపిపి పెద్దవంగర

మహబూబాబాద్, జులై 20 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని సాయి గార్డెన్స్ లో శ్రీ తులసి మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో 6వ మహా సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎంపిపి ఈదురు రాజేశ్వరి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో మహిళలు అన్ని రంగాలలో మరియు స్వయం సంఘాల ద్వారా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు.మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసిఆర్ పనిచేస్తున్నారని అన్నారు.రాష్ట్ర పంచాయతీ రాజ్ డ ఆర్డబ్ల్యూఎస్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సహకారంతో మండలానికి 3కోట్ల 75లక్షలు రూపాయలతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు,5లక్షల 60 వేలతో పిండి మిల్లును మంజూరు చేశారని తెలిపారు.అంతేకాకుండా మండలంలోని 464 స్వయం సహాయక సంఘాలకు 15కోట్ల 30లక్షల రూపాయలు బ్యాంకు లింకేజీ ద్వారా ఈ సంవత్సరం మంజూరు చేయించారని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ ఏపీడీ యండి నూరోద్దీన్, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ఏపిఎం నరేంద్ర కుమార్,స్థానిక సర్పంచ్ వెనుకదాసుల లక్ష్మి, ఎంపిటిసి ఎదునూరి శ్రీనివాస్, పాలకుర్తి దేవస్థానం చైర్మన్ వెనుకదాసుల రాంచంద్రయ్య శర్మ,మండల సమక్య అధ్యక్షులు శ్రీరాం సుజాత, కార్యదర్శి ఉపేంద్ర, కోశాధికారి మంజుల, సిసిలు పద్మ, సుజాత, సుధాకర్, మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం, జులై 20: (నేటినిజం ప్రతినిధి): వరద ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలను ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ బుధవారం సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వ సహాయంపై భరోసా కల్పించారు. బూర్గంపహాడ్ మండలం, మొరంపల్లి బంజారా గ్రామ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఆశ్రయం పొందుతున్న బాధితులకు అందుతున్న సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు.

ముంపు బాధితుల ఇళ్ల వద్ద
వరద ముంపు వల్ల ఏర్పాడ
విధ్యుత్, త్రాగునీటి సరఫరా కు

అంతరాయం పునరుద్ధరణ పనులు, పారిశుద్ధ్య చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు బాధితులకు వివరించారు. ఆందోళన పడవద్దని, ప్రభుత్వం ద్వారా అన్ని విధాల సహాయం అందిస్తామన్నారు.

గజల్ ముశాయరా

భరతమాత సేవలోన గడపాలని అనుకున్నా
త్యాగధనుల చరితలన్ని చదవాలని అనుకున్నా

నీతిధర్మ శాస్త్రాలను ప్రపంచానికందించిన
దివ్యజనని కీర్తనలను పాడాలని అనుకున్నా

కులమతాలు యెన్నివున్న కూడికలిసిపోతున్నా
ప్రతీమనిషి పాదాలను కడగాలని అనుకున్నా

రంగురూపు వేరైనా రాజసమే పుట్టిపడును
సమభావన అందరిలో చూడాలని అనుకున్నా

పరిమళించు పుష్పాలను మాలలుగా అల్లుకుని
అమరులదేహాలపైన వేయాలని అనుకున్నా

పుత్తడికే సాటిరాని పుడమితల్లిరానేలా
ధగధగమని మెరియంగా చూడాలని అనుకున్నా

తల్లిరుణం తీర్చుకొనుట నీలక్ష్యం పరమేశా
అనునిత్యం అమ్మపేరు తలవాలని అనుకున్నా

–గణపురం పరమేశ్వర్
7013333911

చరిత్రలో నేటినిజం

కం॥ శిలనగమ్మున-చల్లగ-
జిలిగి సంపత్తిన్నివరచు సర్దుణమోగా-
జిల్లెట గాసు నెఱుగ-జీ
ఖిల్లెతి సా గాసిసాబ "మల్లకార్జున కార్డే" !!

(జులై 21 నేత మల్లికార్జున కార్డే జననం...)

–రాధశ్రీ
సెల్: 9494481210

గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో ఉంచాలి : మంత్రి సబిత ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, జులై 20: గ్రంథాలయంలో పాఠకులకు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేటలో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ శ్రీధర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కప్పాటి పాండు రంగా రెడ్డి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మనోజ్ కుమార్, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డితో కలిసి మంత్రి సందర్శించారు.

గ్రంథాలయంలో ఉన్న అన్ని రూమ్‌లను మంత్రి పరిశీలించారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ వేయడంతో వేలాదిమంది విద్యార్థులు గ్రంథాలయాలలో చదువుకోవడం చూసిన మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఇంత తొందరగా ఇంత మంది విద్యార్థులు గ్రంథాలయంకు వచ్చి చదువుకుంటారని ఊహించలేదన్నారు.గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ శ్రీధర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పాండు రంగారెడ్డిని మంత్రి అభినందించారు. లైబ్రరీలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని మంత్రి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

మెడికల్‌కు సంబంధించిన పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన మరి కొన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచితే బాగుంటుందని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందిస్తు అవసరం అయిన అన్ని రకాల పుస్తకాలను తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

ముంపు బాధితుల సర్వే వెంటనే పూర్తి చేయాలి

– ఖమ్మం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 20 (నేటి నిజం ప్రతినిధి):వరద ముంపు బాధితుల సర్వే వెంటనే పూర్తి చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం బూర్గంపహాడ్ తహశీల్దార్ కార్యాలయంలో సర్వే బృందానికి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వే బృందాలు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. కుటుంబాల సంఖ్య, ఆర్థిక పరిస్థితి, ఎంత మేర నష్టం వాటిల్లింది, ఆధార్, రేషన్ కార్డ్, బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించాలన్నారు. ఒక్క ముంపు బాధిత కుటుంబాన్ని వదలకూడదని, సర్వే పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని ఆయన తెలిపారు. సర్వే సమయంలో బాధితులతో ఇప్పటికే పునరావాస కేంద్రాల్లో వివరాలు ఇస్తే ఆ విషయము నివేదికలో పొందుపర్చాలన్నారు. బాధితులతో సంయమనంతో వ్యవహరించాలని, వాదన చేయకూడదని ఆయన అన్నారు. తహశీల్దార్లు, ఎంపిడివోలు, సర్వే ను రాండంగా తనిఖీ చేయాలని ఆయన అన్నారు. సర్వే ను బుధవారం మధ్యాహ్నం కల్లా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. బూర్గంపహాడ్, సారపాక, గ్రామాల్లో ముంపు బాధితులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బూర్గంపహాడ్ లో ముంపుకుగురైన 9 కాలనీల్లో 9 టీములు, సారపాక లో 6 కాలనీల్లో 6 టీములు ఏర్పాటుచేసి సర్వే ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన అన్నారు. మంగళవారం వరకు పునరావాస కేంద్రాల్లో ముంపు బాధితులకు ఏర్పాట్లు, ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు, కేంద్రంలో ఉన్నవారి వివరాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. బుధవారం నుండి ముంపు ప్రాంతాల్లో టీములు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని, పునరావాస కేంద్రాలకు వెళ్లి, వివరాలు ఇవ్వనివారు, బంధువులు, ఇతర సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తిరిగి ఇండ్లకు వచ్చిన వారి వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయిలో తహసీల్దార్లు, రెవిన్యూ సిబ్బంది క్రియాశీలకంగా ఉన్నట్లు, ఖమ్మం, హుజూర్ నగర్, ఆర్డీవోలు పర్యవేక్షణ చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఏ ఒక్కరూ ఎటువంటి ఆందోళన చెందవద్దని, బాధిత ప్రతి ఇంటికి ప్రభుత్వం నుండి సహాయం అందుతుందని కలెక్టర్ తెలిపారు.

అంతకుముందు ఖమ్మం కలెక్టర్ సారపాక గ్రామంలో పర్యటించి, వరద ముంపు ఇండ్లను పరిశీలించారు. ముంపు బాధితులకు ప్రభుత్వం నుండి అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

కలెక్టర్ సుందరయ్య నగర్ లో ముంపు ఇండ్లను పరిశీలించి, అక్కడ చేపడుతున్న సర్వే ను పరిశీలించారు. పాత సారపాక ప్రాంతంలో పర్యటించి వరదతో నష్టపోయిన ఇండ్లను పరిశీలించారు. వరద ఎక్కడివరకు వచ్చింది. ఎక్కడ పునరావాసం పొందింది గృహస్తులను అడిగి తెలుసుకున్నారు. బసవప్ప క్యాంపు ప్రాంతంలో పర్యటించి ముంపు ఇండ్లను పరిశీలించారు. సర్వే ప్రక్రియను పరిశీలించి, ఖాతా సంఖ్య స్పష్టంగా వ్రాయాలని, కావాల్సిన వివరాలు పూర్తిగా సేకరించాలని ఆయన అన్నారు. బూర్గంపహాడ్ గ్రామ మెయిన్ రోడ్, గొల్లబజార్ లలో పర్యటించి, వరద నీరు ఎక్కడివరకు వచ్చింది. ఆ సమయంలో ఎక్కడ భద్రత పొందింది అడిగి తెలుసుకున్నారు. గొల్లబజార్ లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుద్ధ్య చర్యలు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ, త్రాగునీటి సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

కలెక్టర్ పర్యటన సందర్భంలో ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, హుజూర్ నగర్ ఆర్డీవో వెంకారెడ్డి, ఖమ్మం జెడ్పి సిఇఓ అప్పారావు, డిపివో హరిప్రసాద్, రఘునాథపాలెం తహసీల్దార్ నర్సింహారావు, బూర్గంపహాడ్ తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఎంపిడిఓ వివేక్ రామ్, బూర్గంపహాడ్ సర్పంచ్ స్వప్న, అధికారులు, తదితరులు ఉన్నారు.

అప్పుడు అంబేద్కర్.. ఇప్పుడు సీఎం కేసీఆర్ : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ జులై 13: దళితుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్.. మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి దళితుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ రూరల్ మండలం మన్యంకొండ చౌరస్తా వద్ద దళిత బంధు పథకం లబ్ధిదారులకు యూనిట్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు.

యాదయ్య అనే లబ్ధిదారునికి పాడి పరిశ్రమ యూనిట్, మన్యం, చంద్రయ్య అనే లబ్ధిదారులకు సెంట్రింగ్ యూనిట్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు పథకం ద్వారా పేద దళితులకు సీఎం కేసీఆర్ అండగా నిలిచారని మంత్రి తెలిపారు. దేశంలో ఎవరూ చేయని ఆలోచన కేసీఆర్ చేశారని ఆయన పేర్కొన్నారు.

దళిత బంధు పథకం భవిష్యత్తులోనూ కొనసాగుతుందని, అర్హులైన పేద దళితులందరికీ ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఒకప్పుడు తాగడానికి నీళ్లు లేని పరిస్థితి నుంచి ఇప్పుడు అన్ని రంగాలు బాగుపడే పరిస్థితి వచ్చిందన్నారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన సంక్షేమానికి, అభివృద్ధికి కారణం ఎవరో ప్రజలంతా గుర్తించాలని.. సంక్షేమ సారథి సీఎం కేసీఆర్ కు రాష్ట్ర ప్రజానీకం అండగా ఉండాలని మంత్రి కోరారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ , రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, రైతుబంధు సమితి డైరెక్టర్, సర్పంచులు చంద్రకళ, శ్రీకాంత్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలవరంతో లక్ష ఎకరాలు మునిగిపోతాయి : రజత్ కుమార్

హైదరాబాద్, జులై 20: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో లక్ష ఎకరాల భూమితో పాటు భద్రాచలం, పర్ణశాల సైతం మునిగిపోతాయని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలపై రజత్ కుమార్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎస్సారెస్పీ, కడెం, కాళేశ్వరం ప్రాజెక్టులు, భద్రాచలంకు వాటిల్లిన ముప్పు, భద్రతా అంశాలపై రజత్ కుమార్ సమీక్షించారు.

ఈ సందర్భంగా రజత్ కుమార్ మాట్లాడుతూ.. కడెం ప్రాజెక్టుకు ఇటీవలే మరమ్మతులు చేయడంతో.. ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. గడిచిన 100 ఏండ్లలో ఎప్పుడూ లేని విధంగా కడెం ప్రాజెక్టు ఎగువన భారీ వర్షం కురిసిందని తెలిపారు. వరదలు, వర్షాలపై ప్రభుత్వం సంసిద్ధంగా లేదనడం సరికాదన్నారు. వరద నష్టం అంచనాలపై మీడియాలో వస్తున్న కథనాలు నిరాధారం అని స్పష్టం చేశారు. సీడబ్ల్యూసీ 18 విభాగాల అనుమతి తర్వాతనే ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుందని రజత్ కుమార్ గుర్తు చేశారు.

చారిత్రాత్మక ప్రాంతాలకు ముప్పు..

పోలవరంతో లక్ష ఎకరాల వరకు మునిగిపోతాయి. బ్యాక్ వాటర్‌తో పంట నష్టంతో పాటు చారిత్రాత్మక ప్రాంతాలకు ముప్పు ఉందని తెలిపారు. భద్రాచలం, పర్ణశాల కూడా మునిగిపోతాయని చెప్పారు. పోలవరం బ్యాక్ వాటర్ విషయంలో స్టడీ చేసేందుకు కేంద్రానికి ఎన్నోసార్లు లేఖలు రాశామని తెలిపారు. బ్యాక్ వాటర్ నష్టం, ఇతరత్రా అంశాలపై కేంద్రం ఇప్పటికీ స్పందించలేదని పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 25 కోట్ల నష్టం

భారీ వరదలతో కాళేశ్వరం ప్రాజెక్టుకు సుమారు రూ. 20 నుంచి 25 కోట్ల నష్టం జరిగిందని రజత్ కుమార్ తెలిపారు. అగ్రిమెంట్లో పేర్కొన్న విధంగా ఆ నష్టాన్ని నిర్వహణ సంస్థలే భరిస్తాయన్నారు. 45 రోజుల్లో కాళేశ్వరం పంప్ హౌస్‌ల మరమ్మతు పనులు పూర్తవుతాయని రజత్ కుమార్ స్పష్టం చేశారు.

చదువుతోనే జీవితాలు బాగుపడతాయి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ జులై 13: చదువుతోనే జీవితాలు బాగుపడతాయని మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన ప్రకారం.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను సీఎం కేసీఆర్ దశల వారీగా మెరుగుపరుస్తున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బడులను బాగు చేసేందుకు తమ సర్కారు ఎంతో చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆయన అన్నారు.

స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ 2021-22 జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆరు అంశాల్లో మెరుగైన ప్రమాణాలు కలిగిన 30 పాఠశాలలకు స్వచ్ఛ విద్యాలయ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్ నగర్ జిల్లా ఒకప్పుడు దేశంలోనే అత్యల్ప అక్షరాస్యత శాతం ఉన్న జిల్లా కాగా నేడు అన్ని రంగాలతో పాటు విద్యారంగంలో సైతం ఊహించని ప్రగతి సాధించిందని తెలిపారు.

పాఠశాలల అభివృద్ధి కోసం నిధుల కేటాయింపు పెంచిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కిందన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం మన ఊరు –మనబడి ద్వారా రూ.7400 కోట్లు ఖర్చు చేసి దశలవారీగా అభివృద్ధి చేస్తున్నారని, సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నామని తెలిపారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాలో పైలెట్ పథకం కింద అన్ని పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని, ఇంకా ఎక్కడైనా స్థలం లేని చోట స్థలాన్ని గుర్తించి అనుసంధానంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. పేద విద్యార్థులు ఎక్కువగా చదివే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులంతా మెరుగైన విద్య కోసం ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అడిషనల్ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు వేయడం ప్రభుత్వం వంతు.. కాపాడుకోవడం ప్రజల బాధ్యత : స్పీకర్ పోచారం

కామారెడ్డి, జులై 20 రోడ్లు వేయడం ప్రభుత్వం వంతు, వాటిని కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. బాన్సువాడ గ్రామీణ మండలం బోర్లం క్యాంప్ నుంచి బాన్సువాడ-గాంధారి ఆర్ అండ్ బీ రహదారి వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును స్పీకర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ రోడ్డు వేస్తున్నారు. వందేళ్ల వరకు చెక్కు చెదరదన్నారు. రోడ్లపై కేజ్ వీల్ ట్రాక్టర్లను నడపొద్దని ఆయన సూచించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నారని స్పీకర్ తెలిపారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

ఉపాధి కల్పన అతి పెద్ద సవాల్ : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జులై 20: నిరుద్యోగం అన్ని ప్రభుత్వాలకు సవాల్‌గా మారిందని, అవకాశాలను అందిపుచ్చుకున్నప్పుడే అందరికీ ఉపాధి కల్పన సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. దళిత బంధును పుట్నాలు, బఠాణీల మాదిరిగా పంచేందుకు పెట్టలేదని పేర్కొన్నారు. సంపద పునరుత్పత్తి కావాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఉద్ఘాటించారు. పేదరిక నిర్మూలన కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. హైదరాబాద్ సైఫాబాద్‌లో దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిజినెస్ ఫెసిలిటేషన్ సెంటర్, మోడలో కేరీర్ సెంటర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. అమెరికా ప్రభుత్వాన్ని నడుపుతున్న జో బైడెన్ కావొచ్చు.. దేశాన్ని నడుపుతున్న ప్రధాని మోదీ కావొచ్చు.. రాష్ట్రాన్ని నడుపుతున్న సీఎం కేసీఆర్ కావొచ్చు.. అందరి ముందున్న అతి పెద్ద సవాల్ ఏంటంటే.. ఉపాధి కల్పన, నిరుద్యోగం అని కేటీఆర్ తెలిపారు. ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు చదువుకొని విద్యావంతులు అవుతున్నారు. వారి విద్యకు, అర్హతకు తగ్గ ఉపాధి కల్పించడం అంటే ప్రతి ప్రభుత్వానికి అది పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ రంగంలో ఉపాధి కల్పన పరిమితంగానే ఉంటుందని తెలిపారు. మిగతా వారు స్వయం ఉపాధి అవకాశాల వైపు వెళ్లాలని, పారిశ్రామికవేత్తలుగా మారాలని సూచించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేసిందన్నారు. పరిశ్రమలు స్థాపించే వారి కోసం టీఎస్ ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

అందరికీ ఒకటే రక్తం, ఒకటే బుర్ర..

ఒక్కొక్కరూ ఒక్క దేవుడిని నమ్ముతారు. కానీ వాస్తవం ఏంటంటే.. దేవుడి అందర్నీ సమానంగానే పుట్టించారు.అందరికీ ఒకటే రక్తం, ఒకటే బుర్ర ప్రసాదించారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇంకో వాస్తవం ఏంటంటే.. ఉద్యోగవకాశాలు మాత్రం అందరికీ ఒకే రకంగా ఇవ్వలేదు. దేవుడు మనిషిని పుట్టిస్తే.. ఆ మనిషి మతాన్ని, కులాన్ని పుట్టించాడు. ఈ విషయాన్ని కొంత మంది ఒప్పుకోవచ్చు.. ఒప్పుకోకపోవచ్చు. మనిషి పుట్టించిన కులం, మతం ఆధారంగా మనల్ని మనం విభజించుకొని జీవనం గడుపుతున్నాం. ఇవి మనం చేసుకున్న కార్యక్రమాలని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మనకు కనబడేది రెండే రెండు కులాలు..

దేశ వ్యాప్తంగా మనకు కనపడేది రెండే రెండు కులాలు.. ఒకటి డబ్బున్నవాడు.. రెండోది డబ్బు లేనివాడు. దళితుల్లో కూడా డబ్బున్న వారి పరిస్థితి ఒకటి. డబ్బు లేని వారి పరిస్థితి ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా కూడా ఇద్దరే కనబడుతారు.. ఒకటి డబ్బున్నవాడు.. రెండోది డబ్బు లేని వాడని కేటీఆర్ తెలిపారు. ఈ ఎనిమిదేండ్లలో తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు.. దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తివంతంగా మారాయని డిక్కీ ప్రతినిధులు చెప్తుంటే ఆనందం వేసిందన్నారు.

పాలు, పాల ఉత్పత్తులపై జీఎస్టీని వ్యతిరేకిస్తూ టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన

న్యూఢిల్లీ, జులై 20: కేంద్రానికి వ్యతిరేకంగా టీఆర్ఎస్ ఎంపీలు మరోసారి గళమెత్తారు. పాలు, పాల అనుబంధ ఉత్పత్తులపైన కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ పన్నుపోటుకు వ్యతిరేకంగా.. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన నిర్వహించారు. టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు కే కేశవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పాలు, పాల ఉత్పత్తులు, ఇతర ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ నిరసనలో పాల్గొన్నారు. గ్యాస్ ధరల పెంపుపై ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో టీఆర్ఎస్ ఎంపీలతో పాటు ఇతర విపక్ష పార్టీల ఎంపీలు కూడా పాల్గొన్నారు.

అద్భుతమైన సౌకర్యాలు ఉన్న సమీకృత సాంఘిక సంక్షేమ వసతి గృహం... ఎర్రబెల్లి దయాకర్ రావు మంత్రి.

మహబూబాబాద్, జులై 20 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం సమీకృత సాంఘిక సంక్షేమ వసతి గృహం తొర్రూర్ నందు రాష్ట్ర పంచాయతి రాజ్ , గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేతుల మీదగా విద్యార్థులకు సైకిల్ లు పంపిణీ చేయడం జరిగింది.సమీకృత సాంఘిక సంక్షేమ వసతి గృహం తొర్రూర్ నందు అద్భుతమైన సౌకర్యాలు కల్పించినా కూడా ఎన్రోల్మెంట్ తక్కువగా ఉందని ,జిల్లా కలెక్టర్ శశాంక సూచన మేరకు ఆర్డిఓ ఎన్రోల్మెంట్ పెంచే దిశగా చర్యలు తీసుకోగ 30 మంది విద్యార్థుల నుండి 100 మంది విద్యార్థులకు చేరారు. అయితే హైస్కూల్ కి దూరం ఎక్కువగా ఉందనీ కాబట్టి సైకిల్ లు ఉంటే పిల్లలకి సౌకర్యంగా ఉంటుందని ఆర్డిఓ , కొందరు ప్రజా ప్రతినిధులు తెలిపారు. తథానుగుణంగా దాతల ద్వారా 100 సైకిల్ లు సేకరించి ఈరోజు 100 సైకిళ్ళు తొర్రూర్ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు మంత్రి మరియు కలెక్టర్ చేతుల మీదగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 21-7-2022

ఉద్రేక భరితం-రాజాగణేష్ కవిత్వం



"తొక్కిపట్టలేనిది.. ఎక్కు పెట్టిన రాం బాణం
నా కలం బలం" అంటు "కవితాగ్ని పుష్పాలు" రాలుస్తున్న లక్కోజు రాజా గణేష్. వివిధ పత్రికల్లో విరివిగా రాస్తు వ్యక్తమవు తున్న కవి. యిది వరలో ఈ కవి వెలువరించిన 'సిరివెన్న ముద్దలు" గేయ సంపుటి మరియు 'జ్వలితాస్త్రాలు' కవితా సంపుటిపై సమీక్షలు రాసినట్టు గుర్తు. యిప్పుడు తాజాగా దాదాపు 80 కవితలతో తన రెండవ కవిత్వ పొత్తం ప్రకటించారు. ఈ గ్రంథంలోని కవితలన్నీ సాహిత్య పత్రికల్లో ప్రచురితమైనవే.. ముఖ్యంగా ప్రసారిక, విశాలాంధ్ర పత్రికల్లో సింహభాగం కవితలు కనిపిస్తయి.

రైతుల వెతలు, కార్మికుల శ్రమదోపిడీ, అనాథ పిల్లలు యిలా సమాజంలోని దృశ్యాలు ఈ కవి వస్తువులు. అవినీతి పట్ల అసహనం మెండు.

"చీకటి చీల్చే ఎర్రెర్రనివాడు సూర్యు డొక్కడే
అవినీతి చీకటి చీల్చే ఆ ఒక్కడు నువ్వే గుర్తుంచుకో!" అవినీతికి పాల్పడేవాడు ఒకడుంటే, వాడిని ప్రోత్సహించే వాడు మరొకడు వున్నట్టే గదా! ఈ chain ని ఛేదించే వాడివి నువ్వే కావాలి అని ప్రజలకు ప్రబోధిస్తున్నాడు. ప్రజలంటే సమాజమేగా!

"ఇనుము మరిగించి, కరిగించి సాగతీసి తీగెలుగా
ప్రపంచ సౌందర్యం శ్రమైక జీవన వనమని, అదే
వేవేల వెలుగని చాటు నేటి కాంట్రాక్ట్ కార్మికుని దేశ దేహం
గుర్తింపే కరువైన ధగధగల మెరిసే అణువంత బ్రహ్మాండం!"

శ్రమ సౌందర్యం సరే! శ్రామికుడికి గుర్తింపేదీ! అన్నది కవి ప్రశ్న.

"మద్యం కంపు ఇంపుగ నేతలు
రాసే తలరాతలు కావా?
గాంధీ కలలు కన్న సంపూర్ణ మద్య నిషేధం
విధించరెందుకు?"

యిదేం ప్రశ్న కవిగారూ? ప్రభుత్వాలకు ముఖ్యమైన ఆదాయ వనరు మద్య విక్రయమే సుమా! పాలకులు మారడమేగాని వాగ్దా నాలు నెరవేర్చడం వుండదు!

"అమ్మా, నాన్న, ఆలీ అసలు ఆస్తులు
రేపటి కూడికల కలిసే బిడ్డలే కొసర్లు"

కొసర్లు సరే! అనుబంధాల మాటేమిటి?

"హృదయానుభూతుల వరుస వరుసల పేర్చేవాడు
వాడేమాన్యుడు! అసామాన్యుడు" గా తేల్చుస్తాడు కవి.

"సంధ్యాసమయాన ఒంటిగా వృద్ధ ప్రయాణ భారము ఘోరమే
రారాజైను కానీ ఆలి చచ్చినవాని దేహము నికరమ్ము శవము!"

వృద్ధాప్యంలో జీవిత భాగస్వామిని పోగొట్టుకున్న మనిషి జీవితం విషాదం.. దుర్భరం!

పీఠికలో ఎమ్.వి.వి. సత్యనారాయణగారు అభిప్రాయపడినట్టు రాజారమేష్ కవితల్లో వ్యర్థ పదాల ప్రయోగం ఎక్కువగా గమనించవచ్చు. భావ ప్రకటన సూటిగా లేకుండా పాఠకుడ్ని అయోమయానికి గురిచేసిన సందర్భాలు కూడా చాలానే వున్నాయి.

ఏడు పదుల వయస్సు, దాటిన ఈ కవికి తెలియనిదని కాదు. రాసిందల్లా కవిత్వమూ కాదు, పత్రికల్లో అచ్చయినంత మాత్రాన ఉత్తమమూ కాదు. కవిత్వ సృజనకు ఉద్రేకం కాదు. ఉద్వేగం కావాలి. కవిత్వం పట్ల.. కవితా నిర్మాణం పట్ల మరింత అవగాహన పెంపొందించుకుని ముమ్ముందు కవిత్వం, కవిత్వంలా రాయగల సత్తా రాజాగణేష్ కుందని నా విశ్వాసం.

ప్రతులకు: యల్. రాజా గణేష్
డోర్.నెం.26-47-1
చైతన్య నగర్, పాత గాజువాక,
విశాఖపట్నం-530 026
సెల్: 9247483700

- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

పుస్తక సమీక్ష

సాదాసీదా కవిత్వంతో "పూలు పుప్పొడులు.."!

అలతి అలతి పదాలతో సాదాసీదా కవిత్వంతో.. కవయిత్రి సోలా జానకీదేవి గారు ఓ గ్రంథాన్ని సాహితీ లోకానికి అంద జేశారు. "పూలు పుప్పొడులు" అని నామ కరణం చేసిన ఈ గ్రంథంలో 41 కవితలు కొలువుదీరాయి. ప్రేమ కవిత్వానికి, భావ కవిత్వానికి పెద్దపీట వేస్తూ జానకీదేవి గారు రూపుదిద్దిన ఈ పుస్తకం లో ఆమె ఎంపిక చేసుకున్న కవితా వస్తువులు ఆసక్తికరం గా ఉన్నాయి. అయితే అభివ్యక్తి, శిల్పం వంటి అంశాల్లో ఇంకా ప్రతిభావం తంగా తమ భావ ప్రక టన చేస్తే బాగుండేద నిపిస్తుంది. వృత్తిరీత్యా న్యాయ వాద వృత్తిని ఎంచుకున్న ఆమె... ప్రవృత్తి పరంగా రచనా వ్యాసంగాన్ని చేపట్టడం తో పాటు.. సంగీతం, వీణ, పాటలు పాడటం, క్రీడారంగాల్లో తమ ప్రవేశంతో పాటు ప్రావీణ్యాన్ని సంపా దించడం విశేషం.. 'స్పందన' మహిళా మండలిని నెలకొల్పి.. మహిళా లోకానికి అండగా నిల్వడం అభినందనీయం.. సామాజిక సేవలో సదా తరించే జానకీదేవి గారు సామాజిక బాధ్యతతో తమ లోక పరిశీల నతో... జీవితానుభవాన్ని రంగరించి రాసిన ఇందలి కవితల్లో ఆమె ఉత్తమ వ్యక్తిత్వాన్ని దర్శించగలం..

"నాన్న" అంటే శీర్షికలోరాసిన మొదటి కవితలో నాన్న యొక్క ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. తన సుఖాన్ని మరిచి.. కష్టాన్ని నమ్ముకొని జీవించేవాడే నాన్న అని విడమరిచి చెప్పారు. అయితే ఈ కవితలో కవిత్వాంశ కొరవడకుండా జాగ్రత్త పడితే ఇంకా బాగుండేది.. వచనం డామినేట్ చేయడంవల్ల.. ఓ మినీ వ్యాసంలా రూపాంతరం చెందింది.

కవయిత్రి తాము వృత్తిపరంగా న్యాయ వాది.. కనుక.. స్త్రీలపై అఘాయిత్యాలు చేసేవారికి ఉరిశిక్ష సరిపోదని అభిప్రాయ పడ్డారు. అత్యాచారాలు, మానభంగాలకు పాల్పడేవారు జీవితాంతం కుమిలి కుమిలి గడిపే విధంగా వారిని నపుంసకులుగా మార్చాలని సూచించారు. ఇంకెవడూ ఇటువంటి చెడుపనులు చేయకుండా వారిలో వణుకు పుడుతుందని అభిప్రాయ పడ్డారు. అయితే కవయిత్రిగా ఆమె సూచించిన సూచనలు బాగున్నప్పటికీ.. ఆచరణలో కష్టమున్నది వారికి తెలియంది కాదు.. ఈ కవితలో భావ ప్రకటన చేసే క్రమంలో సంయమనం కోల్పోయారు. ఏది ఏమైనా కవయిత్రిగా తమ ఆలోచనలు ప్రకటించే స్వేచ్ఛ ఆమెకు ఉంటుంది కదా!

కవయిత్రి జానకీదేవిగారు రాసిన ప్రేమ కవితల్లో కొంతమేరకు భావుకతను ప్రదర్శించారు. శీర్షికలు పరిశీలించినప్పుడు సినీ గేయాలు గుర్తుకొస్తాయి. "ఎవరివో.. నీవెవరివో.. 'చెప్పవే చిరుగాలి", "చిన్ని చిన్ని ఆశ''. ''ప్రేమ ఎంత మధురం'', "నువ్వొదంటే నేనొస్తానా?", "అందంగా లేనా!" ఇలా చాలా కవితలకు సినీ, గీతాల శీర్షికలు కాకుండా మరేమైనా పెడితే మరింత కవితలకు శోభకూర్చినట్లయ్యేది.

నీవు భూలోక రంభవా?
త్రిలోక సుందరివా!
ఇంద్రుని కొలువున నర్తించే
మేనకవా! ఎవరైతేనేం.. నా మదిని దోచిన
అందాల రాశివీ..
స్వప్న సుందరివీ గాంధర్వ కన్యవి నీవేగా!
ఇంతకూ
"ఎవరివో.. నీ.. వెవరివో"? అంటూ ముగించారు.

నాతో పెనవేసుకున్న
తీపి జ్ఞాపకాలే ఈ ప్రేమ లేఖలని
నా ప్రియునికి చెప్పవే చిరుగాలి"
అంటూ 'చెప్పవే చిరుగాలి'' కవితను రూపుదిద్దారు.

సంధ్యాసమయాన చంద్రవంకపై
ఊయలలూగాలని ఉందంటూ చిన్న దాని
ఆశను 'చిన్ని చిన్ని ఆశ" కవితలో రాసిన పంక్తులు పరువాలేదనిపిస్తుంది.

ప్రేమికుల జీవితాలకు
హృదయ స్పందనలు కలిగించే
రారాజువు నీవే కదా! అంటూ
''నిండుపున్నమి వెన్నెల'' కవితను తీర్చిదిద్దారు.

'ప్రేమ ఎంత మధురం'' కవితలో విభిన్నమైన ప్రేమలను ఆవిష్కరించారు.

తల్లిదండ్రుల ప్రేమను, అన్నాచెల్లి ప్రేమ బంధాన్ని, యవ్వనదశలో చిగురులు తొడిగే ప్రేమను.. నవ వధూవరులుగా మారిన తరుణంలో భార్యాభర్తలు పంచు కునే ప్రేమను. కాల గమనంలో విడిపోయిన ప్రేమికులు మలి వయసులో ఎదురైతే గుండె లోతుల్లోంచి పుట్టే ప్రేమను. శ్రేయోభిలాషుల ప్రేమను.. దేవుని ప్రేమను ఇలా రకరకాల ప్రేమను ఏకరువుపెడుతూ రాసిన ఈ కవితలో ప్రేమ యొక్క మాధుర్యాన్ని వివరించి చెప్పారు.

'నా మదుర స్వప్నమా' కవితలోనూ కవయిత్రి ప్రేమకే పట్టం కట్టారు. ప్రేమికుల హృదయాలను తట్టారు.

సృష్టికి మూలం స్త్రీమూర్తియని, స్త్రీలను గౌరవించని.. సంస్కృతి వ్యర్థమని 'అమ్మకు మనమేమి ఇవ్వగలము?" కవితను రాశారు!. వ్యాసంలా రూపుదిద్దకుండా జాగ్రత్త పడితే బాగుండేది.

'నే కోరను' కవితలో కవితకు పెట్టుబడి ప్రకృతి అనీ.. ప్రకృతిలో కాదేదీ కవితకు అనర్హం అంటూ కొనసాగించారు. కవులుగా, కవయిత్రులుగా రాసే కవితలు పది మందికి పనికి వచ్చే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. అయితే ఈ కవితలోనూ కవిత్వాంశ కొరవడింది.

కన్నీటి విలువ- హృదయ వేదన.. కష్టాలు.. అవమానాలు.. అనుభవించిన నేస్తాలు మాత్రమే నా అంతరంగాన్ని గ్రహించి.. కళ్లతో గాక.. హృదయాన్ని కళ్ళుగా మార్చుకొని చూడగలరంటూ "అంతం లేనిది ఆవేదన" కవితను రాశారు.

"మీ కడుపునింపే తిండిని నేను..
నీకు నీడను యిచ్చే గూడును నేను"
అంటూ మీ "తరువు"ను కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. తరువు వివిధ రూపాల్లో మనకందించే ప్రయోజనాలను వివరించారు.

ఇలా సాదాసీదాగా కవయిత్రి జానకీ దేవిగారు తమ కవితల్ని ఈ గ్రంథంలో పొందుపరిచారు. ముఖచిత్రం పుస్తకానికి నిండు శోభను కూర్చింది. అధ్యయనం ద్వారా కవిత్వ రచనలో మరిన్ని మెలకువలు తెలుసుకుని.. కవయిత్రి జానకీదేవిగారు తమ కలానికి పదును పెట్టుకోవాలని కోరు కుందాం. కాయకన్న కాడ/ తొడిమె ఎక్కువ అన్న చందంలా ముందు మాటలున్నాయి. అవి ఇరవై పేజీల వరకు విస్తరించ కుండా ఉంటే మరీ బాగుండేది. ఏది ఏమైన తొలి ప్రయత్నంలోనే కవయిత్రి తమ అంతరంగం లోని భావాలను అక్షరాల్లో నిక్షిప్తం చేసి తమ సృజనను చాటుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ప్రతులకు: శ్రీమతి సోలా జానకీదేవి
వై/ఆఫ్. ఎస్. ప్రభాకర్
4/2/244, ఎస్ఎల్ఎన్ఎస్ నగర్
ఉస్మానాసాహెబ్‌పేట్
నెల్లూరు-524 002.
సెల్: 9293149792

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

సంగీరావం

నది
కలుషితం
హృది
కల్మషం
చేయి చాచనివాళ్లు
స్వాభిమాన మూర్తులు
చేయించుకోనివాళ్లు
స్మరణీయ స్ఫూర్తులు

మాటకు పట్టించుకోలేదని
చిటపటలాడకు
మౌనమే ధిక్కారమని
మరువకు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

వన్ వే

పోయేవాళ్ళను పోనివ్వండి
ఏంచేస్తే మాత్రం ఆగుతారా
చుట్టూ ఒక కవచాన్ని బిగించుకు
దూపంలా పైకెగిసిపోతున్న వాళ్ళను
పోనివ్వండి.

అద్దంలో నీడల్లా
పక్కపక్కన గాలితుఫానులై
చుట్టేస్తూనే
ఉండీ లేనట్టు పలకరించే
వారి ఊసు మనకెందుకు
పోనివ్వండి.

ఒక నిశ్శబ్దంలా ముంచెత్తి
సముద్రపు హోరై
అంతలోనే జలపాతపు తుంపరగా
అలసిన కనురెప్పలపై
ఆవిరై న నీటిచుక్కల్లా
ఇగిరిపోనీ
వదిలేసిపోయిన చూపుల్లోనో
వణికిపోతున్న భావిష్యత్తులోనో
ఓరవాకిలిగా తెరచిన
గాలి కాలి అందెల్లోనో
నది ఉపరితలం పై పేరుకు పోయిన
పొగమంచు మసకలోనో
ఎ0దుకి0కా పట్టి ఉంచాలన్న తపన
పోయే వాళ్ళను పోనివ్వక
రాళ్లో పూలో ఏం విసురుతారో మరి
అవన్నీ కుప్పలు కుప్పలుగా
పోగవుతాయి మీ కోసం
లేదూ
పొగచూరిన వంటింటి
పైకప్పు మీ పాలిట మిగలవచ్చు
రివ్వున ఎగిసిపోడానికి

ఎప్పుడో ఒకరోజున
ఆ దారిన మనమూ కదిలాక కాని
తెలిసిరాదు.

-స్వాతి శ్రీపాద
8297248988

ఆశిస్సు

గురువండి గురువు
మా కళ్ళ వెలుగు
బంగారు బాటకు
దారి చూపించు
వజ్రమంటి వ్యక్తిత్వాన్ని
శిల్పిలా చెక్కు
ఏమిచ్చి ఋణం తీర్చుకుంటాం?
చేతులెత్తి మొక్కి
తలవంచితే చాలు
పాదాల నంటి
ప్రణమిల్లితే చాలు
"వందేళ్ళు వర్ధిల్లు"
ఆశిస్సు మన సొంతం!

-యలమర్తి అనూరాధ
9247260206

ఉత్తమ కవిత్వం రావాలంటే సమాజాన్ని చదవాలి

సమాజాన్ని చదివినప్పుడు కవులు ఉత్తమ కవిత్వాన్ని రాయగలరని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి. రమణాచారీ అన్నారు. మానస ఆర్ట్స్ థియేటర్స్ సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత శ్రేష్ఠి శేషగిరి రచించిన 'నేను కాలాన్ని' కవితా సంపుటి ఆవిష్కరించి ప్రసంగించారు. కవులు నిత్యవిద్యార్థులుగా ఉండాలన్నారు. పద ప్రయోగంలో వైవిధ్యత ఉందని శేషగిరి భవిష్యత్తులో మంచి కవి కాగలరని ఆకాంక్షించారు. వాస్తు, జ్యోతిష్యశాస్త్రంలో నిపుణులైన శేషగిరి కవిత్వ రచనతో సమాజాన్ని ఉత్తేజ పరచాలనుకోవడం అభినందనీయమని కొనియాడారు.

ప్రముఖ జ్యోతిశాస్త్రవేత్త శ్రేష్ఠి శేషగిరి రచించిన 'నేను కాలాన్ని' కవితా సంపుటి ఆవిష్కరణలో కోకాభవాని, రఘుశ్రీ, పొత్తూరి సుబ్బారావు కళా వి.యస్. జనార్ధనమూర్తి, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥కె.వి.రమణాచారి, శ్రేష్ఠిశేషగిరి, డా॥ పి. లలితావాణి, రామచంద్రరావు

సభాధ్యక్షత వహించిన నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణానికి సాహిత్యం మాధ్యమమని అన్నారు. గానసభ అధ్యక్షుడు జనార్ధనమూర్తి, సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, తదితరులు పాల్గొనగా డా॥లలిత వాణి సంపుటిని సమీక్ష చేశారు. రఘుశ్రీ స్వాగతం పలుకగా బండారుపల్లి రామచంద్రరావు వందన సమర్పణచేశారు.

చరవాణి

అరచేతిలో ప్రపంచాన్ని చూపిస్తూ,
బంధాలను బలిచేస్తుంది.

నకిలీ ప్రేమలు, కల్తీ స్నేహాలు,
గోడమీద పిల్లులు, రంగుల ఊసరవెల్లులు,
లీటరు పాలలో పది లీటర్ల నీళ్ళలా,
ఇక్కడంతా కలగాపులగం...

బొటనవేలు చివరన ఒక్క నొక్కుతో
సర్వం సిద్ధం,
నోరూరించే జొమాటో, స్విగ్గీ
తక్షణ సేవలో తరించే భాగ్యంతో పాటు,
సోమరితనపు ఊబకాయం ఉచితం,
బద్ధకపు బానపొట్ట బోనస్...

కల్పిత తెరలో కఠిన చూపులు,
చనువిస్తే చొంగ కార్చే చిత్తకార్తె కుక్కలు,
ముఖపుస్తక వినువీధుల్లో విహరిస్తున్నారా?
జాగ్రత్త రెక్కలు తెంచే కత్తెరలు కోకొల్లలు.

ఇన్నాలోకపు దారుల్లో నడుస్తున్నారా?
బీ కేర్ ఫుల్ నడిచే దారిలో
ముళ్ళు వేసి నెపం
మీపై తోసే దగుల్బాజీలుంటారు.

ఒకప్పుడు మనకు బంధీ కాలం,
ఇప్పుడు కాలానికి మనం బానిసలం.
రీల్స్ సంకెళ్లతో బంధించి
బరబరా ఈడ్చుకెళ్తున్నా స్పృహ లేని
మన చూపులు జానెడు తెరకు అంకితం.

గత కాలపు ఆదిమానవులం,
వర్తమాన నవయుగ వైతాళికులం,
ఇలాగే కొనసాగితే,
భవిష్యత్తులో మనిషితనం
చచ్చిన మరజీవులం,

భర్త పిలిచినా, బిడ్డ ఏడ్చినా,
భార్య అరిచినా, చెంప చరిచినా
స్పందించని తరుణం,
చలనం లేని గుణం,

అందుకే చరవాణి,
మంచి కోసం వాడితే మధుర వాక్యం,
చెడు కోసం ప్రయత్నిస్తే మరణ కావ్యం,

-ఎన్.లహరి
9885535506

'నిజామాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకావిష్కరణ

మండలంలోని శ్రీ అపురూప వేంకటేశ్వరాలయంలోని కల్యాణ మండపంలో 'నిజామాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని ఏ ప్రాంత చరిత్రను అధ్యయనం చేసినా స్ఫూర్తి పొందుతారన్నారు. ఆ స్ఫూర్తి సమాజ ప్రగతికి మార్గదర్శనం చేస్తుందన్నారు. చరిత్రను వెలుగులోకి తెచ్చే రచయితలు అభినందనీయులని అన్నారు తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఎందరికో స్ఫూర్తి పంచుతుందన్నారు. సుమారు 80 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన పరిషత్ ఈ పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయ మన్నారు. ఈ పుస్తకంలో 44 మంది వ్యాసకర్తలు రాసిన వ్యాసాలున్నాయని తెలిపారు. మొత్తం 400 పేజీలు ఉన్న ఈ పుస్తకం నిజామాబాద్ జిల్లా సమగ్ర స్వరూపాన్ని ఆవిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో కోర్ కమిటీ కన్వీనర్ అమృతలత, సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి డా॥జుర్రు చెన్నయ్య, ఎంపిపీ యం. ప్రభాకర్, నరేందర్ రెడ్డి, కవులు, రచయితలు, కిరణ్‌బాల, గజపతి, ఆనంద్, సాయిబాబా, శ్రీనివాస్‌గుప్తా, నరేశ్ రావు, శారద, టీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి , డా॥ అమృతలత, డా॥ జుర్రు చెన్నయ్య తదితరులు.

భూమి గుండ్రంగానే ఉంది నిర్ఝుం!

(కథ)

"నాథా! పాపం మీ భక్తుడు లింగయ్య ఎన్ని తిప్పలు పడుతున్నాడో? ఇకనైనా అతని కష్టాలు కడతేర్చరా?" పార్వతీదేవి శంకరున్ని వేడుకొంది.

"పిచ్చి పార్వతీ! బ్రహ్మ రాతను మార్చగలనా?"

"అదేమిటి స్వామీ, మీకది అసాధ్యమా?"

"అవును, బ్రహ్మ రాతను మార్చడం బ్రహ్మకు కూడా సాధ్యం కాదు. నీ కోరిక మేరకు, లక్షలు చేసే మణిని లింగయ్యకు ప్రసాదిస్తాను. ఏమౌతుందో చూడు."

పొలం పని నుండి వస్తుండగా ధగధగ మెరిసే మణి లింగయ్యకు దొరికింది. ఏదో మెరిసే రాయి కదా అనుకుని దాన్ని కోమటి చెంచయ్యకు ఇచ్చాడు. అది చూడగానే చెంచయ్య కళ్ళు చెదిరాయి. కాని కోమటి కదా! లొక్కంగా లింగయ్యను ముగ్గులోకి దించాడు. నమ్మించి, బదులుగా లింగయ్యకు రెండు కిలోల బియ్యం, అరకిలో పప్పు అంటగట్టాడు.

లింగయ్య సంతోషానికంతు లేదు. ఎన్నో రోజుల తర్వాత అతని కుటుంబం కడుపునిండా భోంచేసింది. మరునాడు లేచింతర్వాత? షరా మామూలే!

"చూశావా పార్వతీ! మనం అనుకున్నా కొందరి నొసటి రాతను మార్చలేము? పద ముంబయి వెళదాం. అక్కడి "సావంత్ చాల్"లో ఏమౌతుందో తిలకిద్దాం."

''సోదర సోదరీమణులారా! తమ ఎన్నిక నివేదికలో పేర్కొన్నట్టుగా, ఈ కొత్త ప్రభుత్వం, మనలాంటి గుడిసెల్లో ఉండేవారికి పక్కా ఇళ్లు కట్టి ఇవ్వడానికి గట్టి ప్రణాళిక తయారుచేసింది.'' మీటింగులో చాల్ కమిటీ సెక్రటరీ పరబ్ మాస్టర్ మరాఠీలో ప్రసంగిస్తున్నాడు.

"మన నలభై అయిదు గుడిసెల జాగాలో రెండు బిల్డింగులు కడతారు. ఒక బిల్డింగులో మనందరికి ఫ్లాట్లు ఇస్తారు. అంటే ఇప్పుడున్న మన వంద చదరపు అడుగుల గదులకు బదులుగా రెండు వందల చదరపు అడుగుల ఫ్లాట్లు - హాలు, వంటగది, బాత్రూము, లెట్రిను మొదలు హంగులతో కట్టి ఇస్తారు. ఇప్పుడు రెండు లక్షల ఖరీదు చేసే ఈ గుడిసెకు బదులుగా, దాదాపు పది లక్షలు విలువచేసే ఫ్లాటు మనదౌతుంది."

"మీరు చెప్పడం, మేము వినడం, ఇలా అయిదు సంవత్సరాల నుండి జరుగుతోంది. వంద నెలల బాడుగలు కోర్టులో కట్టాం. ఏమీ లాభం లేదు. మాకైతే ఇవన్నీ ఊకదంపుడు కబుర్లనిపిస్తున్నాయి." ఉపాధ్యక్షుడు భూమయ్య మధ్యలో అందుకున్నాడు. సాంబన్న వంతపాడాడు.

భూమయ్య, సాంబన్న "సావంత్ చాల్" నివాసులు.

మనం ఇంతవరకు సాధించింది ఒక ఎత్తు. ఇకముందు సాధించబోయేది ఒక ఎత్తు.

సావంత్‌చాల్ నగర నడిబొడ్డున పరేల్‌లో ఉంది. అది బడుగు జీవుల గూడు. సాంబన్న తాపీ పని మేస్త్రీ.

భూమయ్యకు టైలర్ షాపుంది. నలభై అయిదు గుడిసెల ఆ చాల్‌లో 20 తెలుగు కుటుంబాలు ఉన్నాయి. వారిలో మగవారు చిన్నా చితకా పనులు చేస్తే, ఆడవారు బీడీలు చేస్తారు. దాంతో ఈ ముంబయిలో జీవితం సాగుతోంది. కొంత వెనకేసుకుంటారు కూడా.

అంతరాయానికి పరబ్ చిరాకు పడ్డాడు.

"నన్ను పూర్తిగా మాట్లాడనీయండి. ఆ తర్వాత మీ ధర్మ సందేహాలు తీరుస్తాను. మనం ఇంతవరకు సాధించింది ఒక ఎత్తు. ఇకముందు సాధించబోయేది ఒక ఎత్తు. ఇన్నేళ్ల మన కృషి ఫలితంగా మన "హౌసింగ్ సొసైటీ" రిజిష్టరయింది. వంద బాడుగలు తీసుకుని, చాల్ ఓనర్ కూడా ఒప్పందానికొచ్చాడు. పథకం పటిష్ఠంగా రూపొందించాం. మనం ఊ అంటే, వచ్చే సంవత్సరం ఈపాటికి మన సొంత ఫ్లాటులో ఉండవచ్చు. "మల్కానీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్" వారి ప్రతినిధి శ్రీ తేవానీగారు మిగతా వివరాలు చెబుతారు."

"శ్రీ పరబ్‌గారు చెప్పినట్లుగా, మీకందరికీ రెండు వందల చదరపు అడుగుల ఫ్లాటు, మీకు ఏమాత్రం ఖర్చులేకుండా కట్టి ఇవ్వడానికి మా ప్రొప్రైటర్ సమ్మతించాడు. మీ సౌకర్యం కోసం ప్రభుత్వం నిర్దేశించిన దానికన్నా 20 చదరపు అడుగులు అదనంగా కట్టి ఇస్తున్నాము."

"దీంట్లో మీ స్వార్థం లేదా?" నామ్‌దేవ్ పాటిల్ అడిగాడు.

"ఎందుకు లేదు? ఉంది. లోకంలో స్వార్థం లేనిదెవరికి? మీరు ఖాళీ చేసిన స్థలంలో పదహారు అంతస్థుల బిల్డింగు కడతాం. ఆ ఫ్లాట్లు ఎక్కువ ధరకు అమ్ముకుంటాం. వచ్చే లాభంలో మీ వాటాగా, మీలోని ప్రతివారికీ ఇప్పటికి రెండింతల స్థలం, అన్ని హంగులతో సమకూరుస్తాం. అంటే మనందరి స్వార్థం అన్నమాట" తేవానీ నవ్వుతూ జవాబిచ్చాడు.

"మాలో కొందరు ఒప్పుకోకుంటే?"

"అందరూ ఒప్పుకుంటేనే పథకం సఫలం అవుతుంది. మా మాట నమ్మనివారికి మూడు లక్షలు ఇస్తాం. ఖాళీ చేయండి. మా పేర వాటిని రాసియ్యండి. గుడిసె మా పేర రాసి మూడు లక్షలు తీసుకుంటారో? లేక పది లక్షల ఫ్లాటు సొంతం చేసుకుంటారో తేల్చుకోండి."

తర్జన భర్జనల తర్వాత, సాంబన్న లాంటి పదిహేనుమంది మూడు లక్షలకు ఓటు వేసారు. భూమయ్య లాంటి మిగతా ముప్పై మంది ఆశావాదులు, పదిలక్షల ఫ్లాటు వైపు మొగ్గు చూపారు.

పొదలోని మూడు పక్షులకంటే చేతిలోని ఒక పక్షే నయమా? కాలమే జవాబు చెప్పాలి.

అయితే కథ ఇంతటితో అయిపోలేదు. సాంబన్న నగర శివార్లలోని బోరీవలీలో ఇంకో గుడిసెకు మారాడు. దానికి ఒక లక్ష, కూతురు పెళ్లితో మరో లక్షకు కాళ్లొచ్చాయి. మిగతా లక్ష తాగుడు, తినుడు, జూదం, మట్కా వీటి హారతిలో కర్పూరం అయింది.

భూమి గుండ్రంగానే ఉంది. నిర్ఝుం! ఇదంతా చూసి బోళాశంకరుడు మందహాసం చేసాడు. పార్వతీదేవి ఉ

-అంబల్ల జనార్దన్
సెల్:09987533225/
8850349858

తెలుగు ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న గొప్ప నటుడు రాజేంద్రప్రసాద్

నటుడు రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న అతిథులు.

తెలుగు ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న మహానటుడు రాజేంద్రప్రసాద్ అని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో రాజేంప్రసాద్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత పూర్వ ప్రధాని పీవీ. నరసింహారావు పేరిట నెలకొల్పిన పీ.వీ. నరసింహారావు-వంశీ-శుభోదయం జీవన సాఫల్య

-స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

పురస్కారం, స్వర్ణకంకణ జాతీయ పురస్కారాన్ని రాజేంద్రప్రసాద్‌కు ప్రదానం చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ లక్షలాది మంది ప్రేక్షకుల మనసుల్ని చూరగొన్న గొప్ప నటుడు రాజేంద్రప్రసాద్ అని కొనియాడారు. పీవీ స్మారక పురస్కారం రాజేంప్రసాద్‌కు అందజేయడం సముచితమైన నిర్ణయమన్నారు. గతి తప్పుతున్న సమాజాన్ని సన్మార్గం వైపు నడిపించే శక్తి, సామర్థ్యాలు సినిమా బుల్లితెరకు ఉన్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కే.వీ.రమణాచారి మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ మంచిపేరు సంపాదించారన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ తమ తండ్రి ప

వర్షం!

ఋతుపవన కాలాన్ని తోసేస్తూ
నింగి నుండి భువికి జారిన జలగంగలు,
కడుపార అన్నం పెట్టే అన్నపూర్ణ ఉగ్రరూపం
దాల్చి పెను విపత్తునే సృష్టించింది,
ఊర్లకు ఊర్లే ఏరులై పొంగాయి,
ఇళ్లు, గొడ్లు, గోదా, సర్వస్వం కోల్పోయినట్లుగా
నిలువు దోపిడీ చేసేసింది,
మనుషులు కట్టు బొట్టుతో మిగలడమే గగనమైంది,
నాసిక్ నుండి ధవళేశ్వరం వరకు కారుమబ్బులతో
గగనం కాళికా రూపం దాల్చింది,
హరుడు ప్రళయ తాండవం చేశాడు,
శ్రావణం ముందే ఆషాడ శాకాంబరీ రూపం
శాపమై పోయింది, చిరుజల్లుల్లో సాగే
లష్కర్ బోనాలు వానగండంలో చిక్కుకొని
ఊపిర్లు దక్కించు కొంది,
చివరి అంకం రంగ వేదికపై
భవిష్యత్తు వాణి పలుకులు
ములుకుల్లా గుచ్చుకొన్నాయి,
సెప్టెంబరేనా నిండని శ్రీరాం సాగరం
రెండు నెలల ముందే భీభత్సమై,
కడెం డ్యామ్ నే కొట్టేసి పొంగింది, గోదారమ్మ
వరద విలయం చరిత్ర
పుటల్లో బృహత్ ప్రళయమై
పరవళ్లు తొక్కింది,
తెలంగాణ, ఆంధ్రాల్లో ఉక్కుపాదం మోపి,
చేయాల్సినంత భారీ
నష్టాలనే మిగిల్చింది,
కాకతీయుల విశ్వ కట్టడం
రామప్ప కన్నీరు కార్చింది,
భగీరథ స్వరూపాలైన
భవ్య కాళేశ్వరం ప్రాజెక్టు పంపు హవుసుల్లో
పీకలదాకా వరద చేరి
యంత్రభూతాలను మత్తులో ముంచేసి
చిత్తు చిత్తు చేసింది,
ఎత్తిపోతల తీరుపై
విమర్శల జడి వర్షం కురిసింది,
బాసర సరస్వతి,
ధర్మపురి నరసన్న, సమ్మక్క
సారలమ్మలు
పవిత్ర జల స్నానాలు చేశారు,
జల ప్రళయాలు ఒకప్పుడు
కోస్తా జిల్లాలకే పరిమితమై ఉండేవి,
గ్లోబల్ వార్మింగ్ పెరిగి
తెలంగాణా జిల్లాల పుట్టి ముంచుతున్నది,
పక్కాగా
పర్యావరణాన్ని దోపిడీ చేస్తూ పోతుంటే
ప్రళయాలు కేరాఫ్ గా
తెలంగాణ దక్కన్ పీఠభూమిని తాకాయి,
సముద్రం లేని ప్రదేశాన్ని పరేషాన్
చేస్తున్నది, కంపిస్తూ, వనికిస్తూ కదిలిస్తున్నది,
విపరీతంగా పెరుగుతున్న నగరీ కరణ,
నవీనీ కరణలు పెను శాపాలై విషం గక్కుతున్నాయి,
పోలవరం ప్రాజెక్ట్ పులి నోట్లో భద్రాద్రి రాముడు
ఇరుక్కుపోయి విలవిలాడుతున్నాడు,
పండుటాకుల్లా లంక గ్రామాలు నీట మునిగాయి,
కుండపోత వర్షాలకు
జంట నగరాలే కాదు,

జిల్లా కేంద్రాలు తాటి చెట్టు
లోతు వరదల్లో కాగితపు పడవల్లా
తేలియాడుతూ ప్రకృతి
కోపానికి కన్నెర్ర
గొర్రెల్లా బలవుతున్నాయి, కరీంనగర్
స్మార్ట్ సిటీ లండన్ రోడ్ల వర్ణనలు
వ్యవహారం పరిహాసమై
రచ్చకెక్కి కుదేలైపోయింది,
కరుణ చూపని వరునుడిని
ఎట్లా శాంతింప జేయాలి?
పిల్లి మెడలో గంట ఎవరు ఎలా కడతారన్నదే
మిలియన్ డాలర్ ప్రశ్నగా మిగిలి పోరాదు,
పాలకుల
మేఘ విస్ఫోటనాలు
ఉత్తుత్తి ముచ్చట్లే, ఏరువాక పున్నమి,
ఆరుకాలాన్ని కాపాడేది
ప్రకృతి పరిరక్షణమే!
బొంగరం విడిచి,
తాడు గుంజోద్దు, ఎద్దులేని
వ్యవసాయం చెయ్యొద్దు...
పాఠాలు, గుణపాఠాలు
ఎవ్వరు నేర్పుతారు?
బంగారు తెలంగాణా
రావాలంటే మంత్రాలకు
చింత కాయలు రాలుతాయా?
విపత్తుల అనుభవాల
మదనాలే కాలాన్ని కాపాడుతాయి..
అదే స్వచ్ఛ తెలంగాణ!
పర్యావరణ తెలంగాణ!

-సంకేపల్లి నాగేంద్రశర్మ,
80748 26371.

"వరద" రాజు!!

ఇప్పుడు దేశమంతా
"వరద " రాజు పాలనే
రహదారుల్లో ఏరుగా
ఊరంతా చెరువుగా
తానే తందనగా దూకుడు
నీరు పెద్దగా నోరు తెరవడమే వరద
ఇప్పుడు అందరికీ వరద రాజు స్మరణే
ప్రవాహంగా రాజు తానే సైన్యమూ
తానే ఏకచ్ఛత్రాధిపత్యం !
వరద రాజు ఆటకు దేశమంతా మైదానం
వద్దంటే ఆగుతాడా రాజు !
బ్యాండ్ మేళం లేకుండానే మేఘ గర్జనగా
అటూ ఇటూ మెరుపులు మెరవగా
వరద రాజు వెడలే తడి తేజముగా
ఇప్పుడు అబ్బో ! వరద అనిపించినా
భూగర్భ జల మట్టం పెరిగి భవిష్యత్తుకు భరోసా
కల కాదు నిజంగా ప్రాజెక్టులకు జలాధిపత్యం
ఆరుగాలల పంటలకూ అరకొర మాటే లేదు
చెరువులన్నీ నీటి మూటలే
అనుకుంటాం గాని కొత్తేముంది
వానకాలం అంటేనే
వరద రాజు పాలన కదా

-కందాళై రాఘవాచార్య,
8790593638

ప్రకృతి వైపరీత్యం

సహజ వనరులను నాశనం చేస్తూ
వాటి ఉనికినే ప్రశ్నార్థకంగా చేస్తూ
ముందుకు సాగిపోతుంది ..
ప్రకృతి వైపరీత్యం ..?
మానవ విజ్ఞానం పెరిగినా కూడా
మనిషి ఉన్నతస్థాయిలో ఉండే బదులు
పాతాళానికి తొక్కేస్తున్న పయనం..!
సాంకేతిక పరిజ్ఞానంతో
సాధించిన పురోగతి
ప్రకృతి కాలుష్యానికి
మూల కారణమవుతున్నా
అవగాహన సదస్సులు లేకపోవడం...
పరిశ్రమల వల్ల వెలువడే
ఘన, ద్రవ, వాయు కాలుష్యాలు
మానవ మనుగడకే
ముప్పు అని తెలిసిన పట్టించుకోని వైనం...
ప్లాస్టిక్ ను విరివిగా వాడుతూ
వర్షపు నీరు భూమికి ఇంకకుండా చేసి
పచ్చని చెట్లను నరికేస్తూ ..
అందమైన భవనాలు నిర్మించుకుంటూ
ప్రకృతిని నాశనం చేస్తున్నాము ...
మితిమీరిన ఉష్ణోగ్రతల ప్రభావంతో
భూమాతకు తీరని శోకాన్ని కలిగిస్తూ...
మనచేతులతో మన కాళ్ళ కింది భూమినే
నాశనం చేస్తూ పోతే మన భావి తరానికీ
మనమేమివ్వగలం..?
అందుకే ..అవగాహన పెంచుకొని
స్వార్థం వీడి ముందుకు పయనిద్దాం..!
కాలుష్య రహిత సమాజం కోసం
కృషి చేద్దాం..!

-బండారు సునీత
9440671530

ముత్యాల హారాలు

కష్టార్జితాన్ని నమ్ము
కలిసి వచ్చును సొమ్ము
పరులకు దానము ఇమ్ము
కలుగునోయి భాగ్యమ్ము

మాటలో మాధుర్యం
దానము లో ఔదర్యం
పనిలో ఉత్సాహం
స్వేచ్ఛలో విహంగం

అహంకారం విడువుము
ఆనందంగా ఉండుము
అన్న దానము చేయుము
ఆదర్శంగా నిలువుము

సమయంతోసాగాలి
అన్వయంతో మెదులాలి
కార్యదీక్ష ఉండాలి
కలిసి మెలిసి ఉండాలి.

వాన చినుకులు కురిసే
పుడమితల్లి మురిసే
రైతన్న సాగుచేసే
పంట పచ్చగా విరిసే.

సైనికుల త్యాగాన్ని
అమరుల ప్రాణాల్ని
ఉపాధ్యాయుల మాటల్ని
"మరువకు" నీ లక్ష్యాన్ని

-చాపలమహేందర్
9949864152

ఆత్మీయత అనురాగం

దూరపు కొండలు నునుపు అన్న చందం..
దూరం దూరంగా ఉంటేనే
మనుషుల మధ్య
ప్రేమలు, అనురాగ ఆత్మీయతలు..
దగ్గరగా ఉండ వలసి వస్తే
మాత్రం ఈర్ష్యా ద్వేషాలు..!
దూరం దూరం ఉంటేనే కొండంత ప్రేమలు
దగ్గరికొస్తే మాత్రం అసూయ అసహనాలు.!
దూరం లో ఉంటే తొండల్లా తలూపుతారు..
దగ్గర లో చేరువయితే ఊసరవెల్లిలా మారుతారు!
మబ్బుల్లో మెరుపుల్లా సముద్రంలో కెరటాల్లా
ఈ ఆత్మీయతానురాగాలు
క్షణ బంగురాలు
రంగుల బొంగరాలు!
అంతా మాయా జాలం
ఆత్మీయ అనురాగాలకు చెల్లిందీ కాలం.!
ఈర్ష్యా ద్వేషాల నడుమ
అసూయ అసహనాలతో
వెళ్ళదీస్తుంది ఈ లోకం.!!

-ఎన్.. రాజేష్
9849335757

చెట్టు

అంతేగాని, కన్నీరా...! అది
కానే కాదు..నువ్వే దాచిన దాహం.
దాహం ఇప్పుడు ద్రోహం అయ్యి
దావానలమై దహిస్తు ఉంటే....
నీలో కామం కాల్చేస్తుంటే....
కమ్మగా కూసే కోయిల వాలక...
రెమ్మల ఒదిగే పిచ్చుక చేరక..
గిజిగాడల్లే గూడే ఊగక...
పశుపక్షాదులు సేద తీరక...
భూతాపానికి భాష్పోత్సేకం
భారమాయెనో..! బాధ పెట్టెనో ..!
పంచన చేరిన వంచకుడు ..
ఈ మానవుడేనని మనాది చెందెనో...!
మనసే లేని...మ్రాను సైతం
మౌనంగా మరి రోదిస్తుంది.
అది మనకే ముప్పని శాపిస్తుంది.

-వి. పద్మ
9951445867

పుస్తక సమీక్ష

మానవ సంబంధాలను తెలిపే కథలు



చెప్పుకునే కథలన్నీ కంచికి పోతాయంటారు. సంస్కారం సభ్యతా, మంచితనం పెంచాలన్న సదాలోచనతో, రచయిత్రి నెల్లుట్ల రమాదేవిగారు వ్రాసిన కథలు కంచికి బదులు పాఠకుల మనసుల్లో తిష్టవేస్తాయి. ఆలోచింప చేస్తాయి. మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తాయి. అందువల్లే ప్రముఖ రచయిత్రి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత ఓల్గాగారు వీటిని మంచి కథలన్నారు. విశ్రాంత ఆచార్యులు, ప్రముఖ రచయిత్రి పరిశోధకురాలు డా॥ ముదిగంటి సుజాతారెడ్డి గారు రమాదేవిగారి కథల్ని ఏ ముద్రకూ లోనుకాని, ఏ శైలినీ పరిమితం కాని వైవిధ్యమైన కథలు అన్నారు.

జీవితాల్ని మానవ సంబంధాల్ని ఆర్థికాంశాల్ని వ్యక్తిగా ఉద్యోగిగా లోతైన, తనదైన దృష్టితో గమనిస్తూ మంచి కథల్ని అందిస్తున్నారు. అవసరార్థులకు ప్రచారం లేని సేవా సహాయాలు అందిస్తూ ఆణిముత్యాల్లాంటి కవితలు, నానీలు కార్టూన్లు నాటికలు, కథలు వ్రాస్తున్నారు. పలు పురస్కారాలు అవార్డులు అందుకుంటున్నారు.

తల్లివేరు 'కథా సంపుటిలో 18 కథలున్నాయి. నాటి స్వాతంత్ర్యానికి పూర్వపు 'దొరల గడీ' కథలు మొదలుకుని నేటి కరోనా బాధితులు, రియల్ ఎస్టేట్ మాఫియా మాయలు వరకు, రికామీగా తిరిగే నేటి యువత మొదలుకుని పదిహేను గంటలు పంచిన నడుం ఎత్తకుండా పనిచేసే పల్లెవాసులవరకు, విస్తృతమైన విషయాలను తన కథా వస్తువుగా చేసికున్నారు. అధిక్షేప ధోరణితో హాస్యం, వ్యంగ్యం అలవోకగా సృష్టించగలరు. 'మానవ సంబంధాలన్నీ ఆర్థికాధారితాలే' అన్నారు. కారల్ మార్క్సు, 'అవసరం'లో కోడలు అత్తకు చేసే నవర్యలు, తీసుకుంటున్న శ్రద్ధ గమనించిన/ చదివిన పాఠకులలాగానే ఆ బ్యాంకు మేనేజర్ కూడా అత్తయెడ కోడలు చూపేశ్రద్ధకు ముగ్ధురాలవుతుంది. చివరాకరుకు తేలిందేమంటే అత్తపెన్షన్ మీదే కోడలి కుటుంబం గడవాలి. కనుక, ఆశ్రద్ధ 'అవసరం' అయిందని నిరూపించారు. రచయిత్రి, ఎటువైపు కథలో నేటియువత చదువువల్ల అటు ఉద్యోగాల్లేక, ఇటు పొలం పనులు అలవాటు లేక 'రెంటికి చెడ్డరేవడ' అవుతున్నారని చెబుతూనే పని చేయాలన్న శ్రద్ధ, ఉత్సాహం ఉంటే కరోనా కష్ట కాలంలో కూడా సంపాదించుకోవచ్చని చెప్పారు రచయిత్రి. కథలోని సారాంశాన్ని నేటి యువత గ్రహించగలిగితే అసలు నిరుద్యోగ సమస్యే, ఉండదని, ఉద్బోధించే మంచి కథ ఇది. 'ఎటువేపు'లోని సురేష్ కథ ఒకలా ఉంటే మొదటి ప్రేమలేఖ' లోని రాఘవ కథ మరొకలా ఉంటుంది. కుర్చీలోంచి లేవకుండా సపర్యలందుకునే రాఘవ భార్య జానకి. కూతురు పురుటికై అమెరికా వెళ్ళటానికి ఉద్యుక్తురాలవుతే, ఏ పనీ చేయ ఇచ్ఛగించని రాఘవ ఎలా మారిపోతాడో తెలియ చేస్తుందీ కథ. ఈ కథలో మరో అంతర్లీన సందేశం- చొరవగా సాయపడేవారు అందరికీ ఇష్టులవుతారని చెబుతారు రచయిత్రి. కాలాన్ని బట్టి ధర్మం మారాలి. ఎవరో ఏదో అన్నారని రాముడు సీతను వనవాసం పాలు చేస్తాడు. ఇందులో సీతతప్పు ఏమిటి? అని నిలదీసే కథ. స్వాతంత్ర్యానికి పూర్వపు ఇతి వృత్తమైనా, నేటికీ ఈ కథాంశం నవ్యత కోల్పోకపోవటం రచయిత్రి ప్రతిభ, ఎప్పుడైనా ఏ కాలమాన పరిస్థితుల్లోనైనా, కలుషితం కానిది తల్లిప్రేమ. వృక్షానికి తల్లివేరు ఎంతటి ప్రాముఖ్యత గలదో కుటుంబానికి తల్లి కూడా వేరులాంటిదే. అహరహం పిల్లల సంక్షేమానికి, బాగుకుతపన పడుతుందని చెప్పేకథ 'తల్లివేరు' కొడుకు ఎటువంటి వాడైనా మాతృత్వపు అమృతధారలు వర్షించుతూనే ఉంటాయనే చెబుతుందీ కథ. కరోనా కథలు, కత్తీ విత్తనాలు పేరు మార్పులో చిక్కులు, ఇవన్నీ రచయిత్రి కథలుగా రూపుదిద్దుకున్నాయి. చదవదగిన, చదివి సారాంశం గ్రహించదగిన మంచి కథలు సమాహారం 'తల్లివేరు'.

ప్రతులకు: అపురూప పబ్లిషర్స్
ఫ్లాట్ నెం.494/ఎ, రోడ్.నెం.22
జూబ్లీహిల్స్,హైదరాబాద్-33
నెల్లుట్ల రమాదేవి
సెల్:9848868068
సెల్:9440622781

- కూర చిదంబరం
సెల్: 8639338675

అబల-సబల...!!

అబలగానుంటేఅలుసు
అదెప్పటికికంటినలుసు
భయాందోళనలుంటేను..
చేస్తారుమిమ్ములపులుసు..!

చిన్నారులచిదిమివేస్తున్నా
మానభంగముల చేస్తున్నా
కామకీచకవంచనలు..
దేశమంత జరుగుతున్నా..!

మారలేదుగమగమ్మగము
ఆగదుగ వారికృత్యము
అక్కృత్యహత్యజ్వాలలో..
ఆహుతౌతున్నసమయము..!

మచ్చికకై వలపువలె
మచ్చుకైన మహిళ కనలె
అమాయక స్త్రీ జాతికిల..
అదుగడుగునా అవస్థలె..!

మగువలార!మేల్కోండి
మంచిఅంచనవేయండి
చెడు వారికి దూరంగా..
దూరంగయుక్తిచూపండి..!

ప్రేమ పేరను మోసాలు
కులమత పెక్కుద్వేషాలు
సుడిగుండాలనితెలిసియు..
చంపకండిక రోషాలు..!

వీరవనితలది ధైర్యము
ధీరమగువలది శౌర్యము
మరవకండి మీమదుల్లో..
తిరుగుబాటె మీస్థైర్యము..!

దురాత్ములదునుమాడండి
కామ పిశాచుల కాల్చండి
తరతరాల శృంఖాలను..
సబలలై త్రెంచి వేయండి ..!

అమ్మగాను ఆలించును
నాన్నతోడు పాలించును
ఆదిశక్తి రూపము తనె.....
అన్నితానె అలరించును..!!

-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493,

చెట్టు

తొలకరిలా
మబ్బుల పువ్వుల్తో
సుగంధ వర్షాన్ని కురిపిస్తూ
బ్రతుకు బీడులోకి
పచ్చని పూపిరై ప్రవేశిస్తుంది...
కాలం వీణపై
ఆమని పలికించే
సుమధుర రాగమై
పల్లవిస్తుంది...
ప్రకృతి పెదవులపై
దోబూచులాడే దరహాసమై
పరిమళిస్తుంది...
మనిషి స్వార్థపు గొడ్డలివేటుకు
దేహమంతా నిండిపోయిన
గాయాలను చూపుతూ
గాలితల్లికి తన మొరను
విన్నవించుకుంటూనే
తన పంచన చేరిన అందరికీ
అనునిత్యం ఆత్మీయతా నీడల్ని
పంచుతూనే వుంటుంది...
అప్పుడప్పుడూ మోడై
శిశిర భారాన్ని మోస్తున్నా
కోటి ఆశల్తో కొత్త జన్మలెత్తుతూ
జనవాహినిని
జాగృతం చేస్తుంటుంది...

-డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
9177732414

వద్దు వద్దు

వద్దు వద్దు
ధూమపానం వద్దు
తెచ్చును ప్రాణాలకు ముప్పు
దమ్ము దమ్ములో కుచించు
ఊపిరి తిత్తులు
క్యాన్సర్ భూతం ఆహ్వానించు
మరణానికి వీలునామా సిద్ధం అవ్వు
రింగు రింగుల పొగ
ఫ్యాషన్ గా సిగరెట్లు పిల్చడం
యువత గమ్మత్తు అనుకొని
భవితను చిత్తు చిత్తు చేసుకొని
చిరునామా గల్లంతు
స్థితిమంతులు కూడా ఆర్థిక
పరిస్థితి గతి తప్పి
శృతి లేని రాగంగా మారు
బతుకు చిత్రం సిధిలం అవ్వు
ధూమపాన ప్రియులరా...
బహిరంగ ధూమపానం నిషేధించిన
యథేచ్ఛగా తాగుతూ పర్యావరణం,
పక్కోడి జీవితాలతో అడుకుంటున్నారు
ఆరోగ్యమే మహాభాగ్యం
ఊపిరి తిత్తులు ఊపిరి ఇవ్వక
దగ్గుతో నిద్ర లేమి
ఎన్నో సమస్యలు
మానసికంగా మారు
ధూమపానం గుడ్డి చెప్పు
'పొగతాగనివాడు దున్నపోతు' అయ్యి పుట్టు
సామెతను
ఆదర్శంగా తీసుకోకు
ఆయుష్షును తీసుకోకు

-వి.శేషారావు
9440408080

ఉద్యమాలకు పురిటిగడ్డ నా తెలంగాణ !!

అందాలను ఆరబోసే చందనాల సింధూరం
త్యాగాల దారిన మెరిసేటి మందారం
అలుపెరుగని వీరులగన్న అవని తల్లి సింగారం
అమరుల ఆశయాల గుర్తె
నేడు మెరిసేటి మందారం ...!
మండిన గుండెల యుద్ధం...
మన ఫిరంగుల శబ్దం..!
భూమి కొరకు భుక్తి కొరకు సాగిన సమరం
వెట్టి చాకిరి విముక్తి కోసం చేసిన ఉద్యమం!
పగబట్టిన పాములవలె విషం చిమ్మే విసునూరు
దోపిడి దొరతనమును నిలదీసిన పోరు-
సాయిధ రైతాంగ పోరు
సవాల్ అంటూ కదిలిన ప్రతి ఊరు
చేసేను రణహోరు..!
కరుణించిన కాలం..
మానిన గాయం...
తెలవారిన స్వప్నం...
నెరవేరిన యజ్ఞం...
పేరిన నృత్యం...
గెలిచిన సత్యం
గుండె గుండెకు తాకిన సాధ్యం..
మన వీర తెలంగాణం!!
కవులకు పురుడు పోసిన పుడమితల్లి రా
సాహిత్య సిరులున్న నెనరుగల గుణమురా
పారేటి ఏరులలో పచ్చిపాల తనమురా
అరవై ఏళ్ల ఓ ఉద్యమ బావుటారా
ఎందరో వీరులు గళలెత్తి గర్జించిన చోటురా
జగమున జానపదులకు ఇలవురా
బతుకమ్మ ,బోనాల పండుగలకు నెలవురా
మాగాణి మట్టి మెరుపు
మన తెలంగాణమ్మురా!
సకల జనుల సమ్మె గా సాగిన సమరం
అస్తిత్వానికి ఒసగిన వరం
అందరం ఒక్కట్టై
సిద్ధించుకున్న స్వరాష్ట్ర సాధనం
భావితరాలకు మనం ఇచ్చిన బహుమానం
మరవబోదు ఈ నేల
ఉద్యమ వీరుల అమరత్వం...

-నందిని గోపు
6302398650

కంటి వెలుగులు!!

మరువలేము మీపని తీరు
మంచికి మార్గదర్శులు మీరు
ఐశ్వర్యానంద సుఖాలెపుడు
ఆశీర్వదించు ఆ దేవదేవుడు!!

అవన్నీ చేసేది వారే
అవనిని మోసేది వారే!
రెక్కలిరగ కష్టించేది వారే
మిక్కిలి దిక్కుమొక్కు వారే!!

ఎదుటబడే ప్రతి ఇళ్ళల్లో వారే
ఎదురుగా చూసే కళ్ళల్లో వారే!
నిర్మాణం నిర్మాణంలో వారే
నిరంతరంగా శ్రమజీవులు వారే!

-మరికంటి
9640407103

కటిక అమావాస్య - నిండుపున్నమ

ఎన్నో అనుభవపాఠాలు నేర్పుతుంది
చీకటి రాతిరి !
అమావాస్య అనుభవాలతో
ముసలిదైపోయింది
తన చీకటినంతా పరిచి చుక్కల వెలుతురును పంచుతోంది
లెక్కలేనన్ని కష్టసుఖాలు,చిక్కులెన్నో
మన జీవితంలో దాగున్నాయని తెలుపుతోంది
నిశీధిలో నిశ్శబ్దంగా ...
నిండుపున్నమి వెన్నెల వెచ్చనినవ్వులు రువ్వుతోంది
వెన్నముద్దలాంటి వెన్నెల
పసితనపు ఛాయలను పులుముకుంది.
పున్నమి వెన్నెలలో తారల అందము
పసి నవ్వుల సన్నాయిలా
మూగ ఊసులెన్నో చెబుతుంది.
పసిప్రాయం కరిగిపోతూ వెచ్చని
,కమ్మని జ్ఞాపకాలను
నెమరేసుకోమని చెప్తోంది
నిండుపున్నమి

- దుగ్గి గాయత్రి
9704055161

ధూమపానం ఒక దుర్వ్యసనం

యువతా ! ఓ యువతా !
కాలుస్తున్నానని
ఖరీదైన సిగరెట్లు
కాలర్ ఎగరేయకు
నీవు కాల్చి బూడిద చేసేది
నీ బంగారు భవిష్యత్తునని గుర్తుచేసుకో.

యువతా ! ఓ యువతా !
గుండెనిండా పొగపీల్చి
గాలిలోకి రింగు రింగులు
పొగ వదులుతున్నానని
నింగిలో నీలిమేఘాలలో తేలిపోకు
నేడో రేపో నీ ప్రాణం కూడా
ఆ గాలిలోనే కలిసిపోతుందని తెలుసుకో

యువతా ! ఓ యువతా !
చుట్టుకొన్న చుట్టలు
కట్టలు కట్టలు బీడీలు
పెట్టెలు పెట్టెలు సిగరెట్లు
తగలేస్తున్నానని తెగసంబరపడిపోకు
నీ దేహం లోపల నీ ఊపిరితిత్తులు
నీవు పీల్చిన ఆ నల్లని పొగాకు పొగకు
ఉక్కిరిబిక్కిరైపోతున్నాయని తెలుసుకో

యువతా ! ఓ యువతా!
పొగత్రాగడం ఆరోగ్యానికి హానికరం
అంటూ హెచ్చరికలు చదువుకుంటూ
చుట్ట... బీడీ...సిగరెట్లు కొనడమంటే
కొంచెం కొంచెం క్యాన్సర్ ని కొనుక్కోవడమే
సరదా కోసం పొగ త్రాగడమంటే
రేపటి నీ సమాధిని నేడు నీవు త్రవ్వుకోవడమే
ధూమపానం ఒక దుర్వ్యసనం...
మానుకోకపోతే
ఖాయం మృత్యువు నిన్ను
ముద్దు పెట్టుకోవడం
యువతా ! ఓ యువతా !
జాగ్రత్త తస్మాత్ జాగ్రత్త !

-పోలయ్య కూకట్లపల్లి
9110784502

ఆట మొదలైంది

(కథ)



ఆట మొదలైంది..అడవిలోని జంతువులన్నీ నాలుగు జట్లు కట్టాయి. అందరికీ సింహం లేదా పులి నాయకులుగా కావాలని పోరుపెడుతున్నాయి. దాంతో ఏనుగుకు కోపం వచ్చింది. అందరికీ అవే నాయకత్వం వహించాలంటే, లేదా అందరూ సింహం లేదా పులి ఉన్న జట్లలోనే ఆడాలనుకుంటే ఎలా వీలవుతుంది? కొంచెమయినా ఆలోచించాలి. కొండంత నేను కూడా ఉన్నాను కదా? అంది ముందుకొచ్చి... ఏనుగు

నువ్వయినా మాకు సంతోషమే. మరి ఈ అడవిలో ముగ్గురే కథానాయకులు. మరి నాలుగో స్థానం ఎవరికి వస్తుందా అనేది మా ఆలోచన. అంతేకానీ నువ్వు మరోలా భావించకు ఏనుగన్నా! కాకుంటే ఎవరికైనా గెలిచే గ్రూప్‌లోనే చేరాలని ఉంటుంది కదా? కాస్త పేరు, కాస్త తిండి దండిగా దొరుకుతాయి కదాని మా ఆలోచన అంతే అంది నక్క ముందుకొచ్చి...

"గెలవడానికి కావల్సింది కోరలు, గోళ్ళు కావు. బుద్ధి. అది గుర్తుంచుకోండి. అనాది నుండి గమనిస్తున్నాము. రాక్షసులు గెలుస్తున్నారా? లేక దేవతలు గెలుస్తున్నారా? నిలదీసింది ఏనుగు.

'నిజమేననుకో. కానీ మొదటి గెలుపు ఎపుడూ రాక్షసులదే కదా? ఎపుడో చనిపోయే ముందు మాత్రమే దేవతలు అంటే మంచితనం, బుద్ధిబలం గెలుస్తుంది కదా అందుకే" నసిగింది కుందేలు.

"నువ్వూరుకో.. అన్నింటికీ ముందుకు రాకు. ఏదయినా నేను నిర్ణయించినట్లు జరుగుతుంది. ఈ మాట నేను అనలేదు. సింహం నాకు అప్పగించింది. సరేనా? ఎవరూ నాకు ఎదురు చెప్పకూడదు. అడవిలోని వారంతా వచ్చినట్లేనా?" అందర్నీ చూస్తూ దర్పంగా అంది ఏనుగు.

"ఇంకా కోతులు రాలేదు. ఈ మధ్య ఒక మాట వింటున్నాం. కానీ అది ఎంతవరకు నిజమన్నది మాకు అర్థం కావడం లేదు" అంది ఎలుగుబంటి ముందుకొస్తూ..

"ఏమిటది?" నిలదీసింది ఏనుగు

"కోతుల్ని ప్రయోగశాలకు తీసుకుని వెళ్ళి వారు తయారు చేసిన మందుల్ని వాటిపై ప్రయోగించి, కొన్ని రోజులు పరిశీలించి, చివరకు ఫలించకున్నా, ఫలించినా వాటిని తిరిగి రోడ్డుమీదకు వదిలేస్తున్నారని" అంది బాధగా.

"మనుషులు కదా! వారంతే! ఆ జాతి అనేది వారి జాతికి మంచి చేయదు. అలాగని నోరులేని మన జాతికి అసలే మేలు చేయదు. ఏం చేసినా అడిగేవారు లేరు. వారి మేధోశక్తికి పావుల్లా మనం తయారవుతున్నాం. అడిగే దిక్కెవరు? మన జాతుల్లో కొన్ని జాతులు అంతరించిపోయాయంటే దానికి మానవుడే కారణం. ఏదయినా చేయగలరు. కానీ మంచి మాత్రం చేయలేరు" అంటూ వాపోయింది ఏనుగు.

ఆ మాటల్లోనే వానరులు వచ్చాయి. ముఖాలు పీక్కుపోయి కొన్ని, శరీరంపై పొక్కులతో కొన్ని వచ్చాయి. చూస్తే జాలేసింది ఏనుగన్నకు. వాటి వాలకాన్ని గమనించిన ఏనుగు ఇక ఆలస్యం చేయకుండా తోడేలక్కా! ముందు నువ్వు ఆ కొండచివర్న ఉన్న ఆవిసి ఆకును కోసుకుని వచ్చి వాటికి అందించు. ఆరోగ్యం కుదుటపడుతుంది. అలాగే వచ్చేటప్పుడు కొన్ని అడవి దోరపండ్లు తీసుకురా" అంది ఆజ్ఞాపిస్తూ..

తర్వాత అందరూ వరుసగా నిలబడ్డారు.

నక్క, కుందేలు, ఎలుగు, జిరాఫీ, ఎద్దు, ఒంటె, ఆవు, కోతి, గండుపిల్లి, అడవి దున్న, అడవి పంది, లేడి, కంగారు, మేక, గొర్రె, పాము, ఒంటె, తోడేలు, ఇంకా ఎన్నో ఆ అడవిలో ఉన్న జంతువులన్నీ ఒక చోట గుమిగూడాయి.

ఏనుగు అందర్నీ నాలుగు గ్రూపులుగా చేరమని ఆజ్ఞాపించింది. మొదటి గ్రూపుకు సింహం, రెండవ గ్రూపుకి పులి, మూడవ గ్రూపుకి ఏనుగు, నాల్గవ గ్రూపుకు ఎలుగుబంటి అధికారమిస్తున్నామని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని, అంతా సింహం ఆజ్ఞానుసారమే నడుస్తున్నామని తెలియజేసింది. ఈ నిర్ణయం చాలా వాటికి అంగీకారం కాకున్నా, మృగరాజు మాటను కాదనలేక ఊరుకున్నాయి. ఇంతవరకు తమకు ఏలాంటి అధికారం లేకపోవడం, ఒక్కసారిగా తనకో స్థానం రావటంతో ఎలుగుబంటి ఆనందపడింది. అందర్నీ నాలుగు వరసల్లో నిలబెట్టడానికి సహాయం చేసింది.

మొదటి వరుసలో నక్క, కుందేలు, జిరాఫీ, ఎద్దు, రెండవ వరుసలో ఒంటె, ఆవు, కోతి, గండుపిల్లి, మూడవ వరుసలో అడవి దున్న, అడవి పంది, లేడి, కంగారు, నాల్గవ వరుసలో మేక, గొర్రె, పాము, ఒంటె, తోడేలు, నిలుచున్నాయి. వాటిని సరిగ్గా గమనించిన ఏనుగు గొర్రెను కోతి స్థానంలోకి, గొర్రె స్థానంలోకి మార్చింది. మీరంతా కాస్సేపు ఇలాగే నిలుచుంటే మృగరాజు, పులి కూడా వస్తారు. అపుడు వివరణ ఇస్తారు అంది ఏనుగు. ఎలుగు కూడా ఏనుగును అనుసరిస్తూ తన పక్కనే నిలుచుంది.

అంతా నిశ్శబ్దంగా ఉన్న సమయంలో కుందేలు ముందుకొచ్చి ఏనుగు మామా! మీరెందుకు ఇదంతా చేస్తున్నారో తెలియటం లేదు. తెలుసుకోవాలనే తొందర లేదు కానీ, మాలో కొన్ని శాఖాహారులున్నాయి. మరికొన్ని మాంసాహారులూ ఉన్నాయి. మరి ఇలా గ్రూపులుగా విడిదీస్తే.." అంది మెల్లగా..

''ఎందుకు? ఇక్కడేమయినా అన్నదానం జరుగుతోందా? నీక్కొంచెం, నాక్కొంచెం అనుకోవడానికి. ముందు మనం జీవులం. భూమి మీద ఎవరు ఏది తిన్నా సమస్య కాదు. అందరూ కలిసి ఉన్నామా లేదా అనేది సమస్య. నువ్వు మాట్లాడకు మృగరాజు వచ్చే వేళయింది" అంది ఏనుగ

గజల్

ఘోషించే అంతరాత్మనాపలేదు నా హృదయం
ప్రశ్నించే గుండె గొంతు నొక్క లేదు నా హృదయం.

కవనాలవి కిరణాలవి నిరాశలకు మరణాలవి
పదునెక్కిన ఏ పదాన్ని వదల లేదు నా హృదయం.

గతము కాదు చరితంటే బాధ కాదు బతుకంటే
ఎదురొచ్చే కష్టాలకు బెదరలేదు నా హృదయం.

నాదన్నది నీదన్నది ఏమున్నది చివరి క్షణం
భోగాలకు మోహాలకు లొంగలేదు నా హృదయం.

పరుల కొరకు బతకలేక పరమాత్మను కానలేవు
స్వార్థమన్న చితిమంటల కాలలేదు నా హృదయం

కష్టాల్లో నష్టాల్లో కాలుతున్న కాష్టాల్లో
పోరాటాల పటుత్వాన్ని వదలలేదు నా హృదయం

బతుకర్థం తెలుసుకొనుటె పరమార్థం ఓ సత్యా!!
ఏ స్వార్థం అస్త్రంగా మోయలేదు నా హృదయం

-శ్రీ శివ లక్ష్మి
8790700383

భారతీయుడిజ్ఞాననిధి

భారతీయుడి జ్ఞానం అపారం,
యువతమేధోశక్తినిఆదరించని
స్వదేశీయుల నిరాదరణతో
తమ మీద తమకున్న అపనమ్మకంతో
పరదేశాలకు వలసపోతోంది యువత,
మన యువత మేధోశక్తిని గుర్తించిన
అగ్రరాజ్యాలు
ఆదరించితమవశంచేసుకొని
లబ్ధిపొంది కూలీలుగామార్చి
తమ గాదెల నింపుకోవడం
అగ్రరాజ్యాలకువెన్నతోపెట్టిన విద్య,
నిరుపయోగంగా మిగిలిపోతోంది మన భారతదేశం,
మన దేశ మేధావులను
విదేశీయులు గుర్తించి అక్కునచేర్చుకొని
అభినందించడం గమనార్హం,
స్వదేశీయులు
మనయువత మేధోశక్తిని
గుర్తించకపోవటం శోచనీయం,
మన అధినేతలు.....
మన దేశ మేధో యువతను
గుర్తించివెన్నుతట్టిప్రోత్సహించిననాడు
మన భారత దేశం కాగలదు
మరో అమెరికా,మరో రష్యా"

-రాయవరపు సరస్వతి
7989665525

నానీలు

నేనన్నది
వదిలేసెయ్.
లోకమంతా నీదే,
అందరూ నీ వాళ్ళవుతారు.

నేను
వాటాలకు ముందుంటాను.
చాకిరీకి
వెతికినా దొరకను.

రాజీ పడలేను.
రాజును కాలేను.

నాకు నేనే
సమస్యగా నేను!!

ఆకాశం అందినా
చాలని నేను.
పక్కోడు అంగుళం
ఎదిగినా చూళ్ళేను.

-విజయకుమార్
9010801073

వీలైతే మీరుకూడా....

ఇప్పుడప్పుడే
మురిసిపోయేదేంలేదు
ఇప్పుడప్పుడే ఎగిరి గంతేసేదేంలేదు
చెట్టింకా ఎదిగే దశలోనే ఉంది

చెట్టెదిగి
పూలుపూసి
కాయలుకాసి

ఫలాలు మన చేతికందాలంటే
తలాకొంచెం నీరుపోయాలి కదా!

ఎదిగే దశలోనే
ఫలాల పంపకంకోసం
కొట్లాటలెందుకు
పండ్లిచ్చే దశలోనే
చెట్టుపై పూర్తి అధికారం నాదేనని
పేరుకోసం పాకులాటలెందుకు

నీడనిచ్చే చెట్టుకోసం
ఆకలితీర్చే చెట్టుకోసం
కడుపులు మాడ్చుకున్నాం
కష్టాలనోర్చుకున్నాం
కన్నీళ్ళను దిగమింగాం
లాఠీదెబ్బలు తిన్నాం
చివరికి తూటాలకూ బలయ్యాం

ఏదైతేనేం
మన చెట్టు మనదైంది

ఆ చెట్టుపై
మనల్ని విడదీసే
ఏ జెండానూ ఎగరేయొద్దు
కుమ్ములాటలను పురిగొల్పే
ఏ రంగునూ పులమొద్దు
ఎందుకంటే
అది అందరి మనసులనేకంచేసి
ప్రేమతో పెరుగుతున్న చెట్టు కదా!
వీలైతే మీరు కూడా కాస్త
శ్రమనీళ్ళని చిలకరించండి

- ఎన్.నరేశ్ చారి
9701334516

పునరావృతం

(కథ)

నువ్వింకా చిన్నపిల్లవి. తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అని నమ్మేదానివి. నీకు ప్రపంచం తెలీదు.

భారతికి మనస్సంతా ఆందోళనగా ఉంది. ఇది అని ఇదమిద్దంగా చెప్పలేని బాధ. వంటింట్లో పని చేస్తున్నదన్న మాటేగాని, మనస్సు మాత్రం ఎదో ఆలోచిస్తూనే ఉంది. మనసు గుబులు గుబులుగా ఉంది. ఇక ముందేం జరుగుతుందో అనే ఆందోళన.

తన పెంపకంలో లోపముందా? మళ్ళీ తనలాగే తన కూతురి జీవితం కూడా..... తల విదిలించింది. మనస్సంతా సాయంత్రం చూసిన సంఘటన చుట్టే సుడులు తిరుగుతుంది.

సాయంత్రం 'టైలరింగ్ మెటీరియల్' షాప్ కెళ్ళి దారపు బిండలు కొనుక్కుని, ఇంటికి రావడానికి తిరిగి ఆటో ఎక్కింది. ఆటో లోని వాళ్ళెవరో మధ్యలో దిగి డబ్బులిస్తుంటే ఆటో ఆపాడు ఆటోడ్రైవర్. చిల్లర లేనట్లుంది. వాళ్ళు పర్స్ లో వెదుకుతున్నారు. యధాలాపంగా బయటకు చూస్తున్న తన కంటికి అల్లంత దూరాన, ఫుట్ పాత్ పైనున్న కుర్చీల్లో అతి దగ్గరగా ఒదిగి కూర్చున్న వాళ్ళిద్దరూ కనబడ్డారు. అనుమానంతో పరీక్షగా చూసింది. సందేహం లేదు. తను ప్రాణ ప్రాణంగా పెంచిన తన కన్న కూతురు సౌమ్యే... ప్రక్కన ఎవరో కుర్రాడున్నాడు. అతన్ని దగ్గరగా ఆనుకుని కూర్చుని అతని చెయ్యి తన చేతుల్లోకి తీసుకుని ఏదో చెబుతోంది సౌమ్య. నిశ్చేష్టురాలయ్యింది. ఈ మధ్య అప్పుడప్పుడు కాలేజ్ నుండి ఆలస్యంగా వచ్చినపుడు తానడిగితే, ప్రైవేట్ క్లాస్ అనో, బస్ దొరకలేదనో చెబుతుంటే నిజమేననుకుంది. కాని తన కూతురు కనీసం పెళ్ళికెదిగిందని కూడా గుర్తించలేదు. అందరు తల్లుల్లాగే తనూ తన కూతురు ఇంకా చిన్నపిల్లేననుకుంది. సౌమ్య ఇంత పెద్దగయ్యిందని తనకిపుడే తెలిసింది. ఈ విషయం భర్తకు చెబుదామంటే అసలే ఆయన కోపిష్టి. నెమ్మదిగా తనే పరిష్కరించాలి. ... కానీ ఎలా.... నెమ్మదిగా కూర్చోబెట్టి, ప్రేమగా అడగాలి. లేదంటే కథ అడ్డం తిరుగుతుంది. అసలు ఆ అబ్బాయి ఎలాంటివాడో? ఏ కులవో? ఆలోచనల్లో ఉండగానే కూతురు వచ్చినట్లు, ఫ్రెషప్ అవుతున్నట్లు నీళ్ళ చప్పుడుతో తెలుస్తూనే ఉంది.

'అమ్మా! ఆకలి దంచేస్తోంది. ఇంకా టిఫినేం చేయలేదా?' సౌమ్య గట్టిగా అంటోంది. ఇంకా భర్త ఆఫీస్ నుండి రాలేదు. కొడుకు కూడా ట్యూషన్ నుండి మరో గంట దాటితెగాని రాడు. అడగడానికి ఎవరూ లేని ఇదే మంచి సమయం. టిఫిన్ పెట్టి అడిగితె, అసలే ఆకలిగా ఉన్న కూతురు కోపంగా టిఫిన్ తినడం మానేస్తుందేమో? పోనీ టిఫిన్ తిన్నాక అడుగుదాం అని, చేసిన వేడి వేడి నర్వపిండిని ప్లేట్లో పెట్టి అందించింది. టీవీ పెట్టుకుని చూస్తూ తింటోంది సౌమ్య. లో నుండి నీళ్ళు తెచ్చిచ్చి ఎదురుగా కూర్చుంది. టిఫిన్ అయిపోయి నీళ్ళు తాగుతుంటే, 'సౌమ్య! నేనొక విషయం అడుగుతాను. నిజం చెబుతావా?' అంది సూటిగా, మళ్ళీ తను, ' ఎక్కడినుండి వస్తున్నా వనో, ఇంత ఆలస్యం అయ్యిందేమనో అడిగితె కూతురు చెప్పే అబద్ధం విని తట్టుకునే శక్తి లేదనో.....లేక కూతుర్ని మరో తప్పు చేయడానికి అవకాశం ఇవ్వద్దనో గాని అడిగింది.

'అదేంటమ్మా? కొత్తగా అడుగుతున్నావు. నిజమే చెబుతాను చెప్పు...'అంది ఆపేసిన నీళ్ళను మళ్ళీ తాగుతూ...

'నువ్వెవరినైనా ప్రేమిస్తున్నావా...' దెబ్బకు పొలమారింది సౌమ్యకు.

'అయ్యో...నెమ్మదిగా తల్లీ...'గబుక్కున లేచి కూతురు చేతిలోని గ్లాస్ తీసుకుని సుతారంగా తలపై కొడుతూ అంది.

చప్పుడు చేయలేదు సౌమ్య. 'చెప్పు తల్లీ...' మళ్ళీ అడిగింది.

'అవునమ్మా....శర్మ అని నా క్లాస్మేట్. అతను కూడా నేనంటే ప్రాణమిస్తాడు .....'

'ఇలా అంటున్నానని అనుకోకు తల్లీ! నువ్వింకా చిన్నపిల్లవి. తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అని నమ్మేదానివి. నీకు ప్రపంచం తెలీదు. అందులో 'లవ్ మ్యారేజ్' అస్సలొద్దు ' నచ్చజెపుతూ అంది.

'ఏం ఎందుకని.....'కొంచెం తీక్షణంగా అంది సౌమ్య.

'ఎందుకంటే కర్ణుని చావుకు సవాలక్ష కారణాల్లా చాలా కారణాలు న్నాయి. .పెద్దదాన్ని ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో.....'

'అదే! ఎందుకని అడుగు తున్నా..... మీదీ లవ్ మ్యారేజ్ నే కదా.... మీరే అర్థం చేసుకుంటారనుకున్నా....'

'అవును....లవ్ మ్యారేజ్ నే....అందుకే వద్దు అంటున్నాను. అందులో ఉండే కష్టాలు నీకు తెలీవు....'

'ఎందుకు తెలీవు....నువ్వు నాన్న బాగానే ఉన్నారు కదా....'

'చాలా సున్నితమైన విషయాలు ఉంటాయి. అవి అనుభవించినవారికే తెలుస్తుంది'

'అంటే మీకు మ్యారేజ్ అయ్యింది కాబట్టి నాకు వద్దంటున్నారా...' ఎగతాళి గా అంది .

'లేదు...అందులోని సాధక బాధకాలు అనుభవించి అలాటి కష్టాలు నా బిడ్డ చవిచూడకూడదని చెబుతున్నా....'

'అన్ని కష్టాలున్నాయా? ఏమిటవి '

'నీకు ఆ బాధలేం తెలుసు. జీవితం అంటే యాంత్రికం కాదు. ఒక్కోసారి కోపం, అలక , ఆనందం..ఎన్నో ఉంటాయి. కాని మనం ఇక అన్నీ కోల్పోతాం. తల్లిగారిల్లు, బంధువులు, ఆత్మీయులు ఎవరూ ఉండరు. ఒక రకంగా చూస్తె, సమాజం నుండి మనం వెలివేయబడతాం. జీవితంలో చైతన్యం కోల్పోతాం. జీవితాంతం ఇంటికే అంకితమవుతాం. చిన్న చిన్న ఆనందాల్ని కూడా అనుభవించలేక పోతాం. పొరపాటున విధి వల్ల ఎక్కడైనా కష్టాలు ఎదురైతే మనకు వెన్ను దన్నుగా ఉండడానికి వెనకెవరూ ఉండరు. ప్రపంచమంతా ఒకవైపు, మనమొక్కరం ఒక వైపు అయిపోతాం. జీవితంలో ఒంటరితనం , మనకంటూ ఎవరూ లేరన్న బాధ ఎంత ఘోరమైనవో నీకు తెలీదు. దానికోసం నేను ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపానో, ఎంత కుమిలి పోయానో నీకు తెలీదు. కొన్ని విను.....

×××

'ఏమండీ! నిన్నటి నుండి నోట్లో నీళు తప్ప ఏమీ పోయలేదు. బాగా ఆకలవుతుంది. చేతకావట్లేదు. ఈవేళ ఏదైనా తినడానికి తెండి. పైగా ఇంటి ఓనర్ వచ్చి , అద్దె ఇచ్చి ఇల్లు ఖాళీ చేయమన్నారు....'

'ఎక్కడి నుండి తేవాలి....అమ్మడానికి ఇంకేమైనా ఉంటె ఇవ్వు'

'నేను తెచ్చిన బంగారమంతా మీకే ఇచ్చాను కదా! ఈ మంగళసూత్రం తప్పితే నా దగ్గరేముంది..'

'అంటే నేను తెచ్చినదంతా మీరే అమ్ముకు తిన్నారుకదా...భార్యకు తిండి పెట్టలేని అసమర్థుడివి అని దెప్పి పొడుస్తున్నావా?....'

'అయ్యయ్యో! నేనలా ఎందుకన్నా నండి.....మీరు కోపంగా ఉన్నారు.... పోనీలెండి తినడానికేమీ వద్దు లెండి..' భారతి అంటుండగానే విసురుగా బయట కెళ్ళిపోయాడతను.

నీరసంగా గోడకు జారగిలబడిన భారతి దగ్గరకు ఓనర్ వచ్చింది.

'అమ్మాయ్! నిన్ను చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. ఏమీ అనుకొబాకు. వట్టి మనిషివి కూడా కాదు. ఇదిగో ముందర ఇది తిను....' అంటూ అన్నం గిన్నె ముందు పెట్టింది.. 'ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు.... మా ఇంట్లో, ప్రక్కింట్లో పని మనిషి మానేసింది. మీ ఆయనకి ఉద్యోగం దొరికే వరకు చేస్తావా... ఇందులో సిగ్గుపడాల్సిందేమీ లేదు. వని చేస్తావు..డబ్బులు తీసుకుంటావు. నువ్వేం ఊరికే చేయి చాచట్లేదు కదా...' అంటున్న ఆమె దేవతలా కనిపించింది భారతికి.

×××

'ఏమండీ.... అన్నం వండాను... తిం దాం వస్తారా....'

'బియ్యం ఎక్కడివి... అప్పడిగావా...మా ఆయన చేతగానివాడని బిచ్చమెత్తావా....'

'చ...ఎం మాటలండీ అవి....పని మనిషి రాలేదని బాధపడుతుంటే పనుల్లో సాయం చేసాను...' భయం భయంగానే అంది.

'ఛీ...ఛీ...పనిమనిషివయ్యావా.... మాదెంత గొప్ప వంశం....వారి ముందు తలెత్తుకు తిరగాలంటే రేపటినుండి నాకెంత నామోషీ!... ఛీ..... ఏం రెండు రోజులు తినకపోతే ఛస్తారా.....' గర్భిణి అని కూడా చూడకుండా పళ్ళెం విసిరి వెళ్ళిపోయాడు.

×××

'నాకు ఉద్యోగం వచ్చింది కదా....నేను చేస్తున్నాను కదా....ఇక నువ్వేం ఆ బోడి ఉద్యోగం చేయక్కర లేదు.....'

'ఏదో చన్నీళ్ల కు వేన్నీళ్ళలా తోడుంటాయి కదా! ఇంట్లో ఊరకే ఉండే బదులు ఏదో ఒక వ్యాపకం. ఏమవుతుంది?..'

'అవసరం లేదన్నానా...అలా నువ్వు నలుగురిలో నేనేదో చేతకానివాడి నయినట్లు ఉద్యోగం చేయడం నాకిష్టం లేదు... మానేయ్యమన్నాను...మానెయ్ .... అంతే ....'

'ఏమిటో...మీకీ మధ్య కోపం ఎక్కువయ్యింది... అసలు మనం ప్రేమించుకునే రోజుల్లో ఎంత ప్రేమగా మాట్లాడేవారు....'ఎవరెస్ట్ ఎంతెత్తైనా ఎక్కేస్తానే నీ కోసం...పసిఫిక్ లో దూకెయ్ మన్నా దూకేస్తానే నీ కోసం' అని పాడేవారు గుర్తుందా...' టాపిక్ జోవియల్ గా మార్చదానికి , మనస్సులో బాధగా ఉన్నా అంది.

'ఆ...అయితే ...ఇంకా భాద్యత లేకుండా....ఏమైనా టీనేజ్ పిల్లలమనుకున్నావా...'

భార్యా భర్తా సరదాగా ఏకాంతంగా ఉండడానికి దానికీ ఏమి సంబంధమో అర్థం కాలేదు భారతికి... ఇవి మచ్చుకు కొన్ని మాత్రమె... ఇలాంటివెన్నో.....

డెలివరీకి ఎవరూ లేక పడ్డ బాధలు, గర్భిణి గా ఉండగా అందరికీ చేసే చిన్న చిన్న సంతోషాలైన శ్రీమంతం లాంటి వాటికి నోచుకోక బాధపడ్డ సంఘటనలు, పిల్లల్ని పెంచే దగ్గర, లాలించే దగ్గర కరువైన అనుభవం....మన ఫ్రెండ్స్ సర్కిల్ లో చిన్న ఫంక్షన్ లకి అటెండ్ అయినప్పుడు వారు అనుభవిస్తున్న ఆనందాన్ని చూస్తె, మనం కోల్పోయిన దాని గురించి కించిత్ బాధ తలెత్తక మానదు. ఇవన్నీ అనుభవిస్తే కాని తెలియని మనస్సుని వెలిపెట్టే సంఘటనలు. పైకెంత సున్నితంగా కనపడతాయో... అంతగా జీవితాన్ని ప్రభావితం చేస్తాయి....మీకు తెలీదు...ఇటు అటు అందర్నీ వదిలేసుకుని వచ్చాం, కాబట్టి మనకు మరో ఆప్షన్ ఉండదు, భర్తతో గొడవ పెట్టుకోవడానికి.

అదే పెద్ద వాళ్ళుంటే వారి మాటల్లో ఓదార్పు, అనుభవాల్లో పరిష్కారాలు కనబడతాయి. అంతే కాదు, రిలాక్సేషన్ కు తల్లిగారిల్లో, బంధువుల ఇళ్ళు లో ఉండవు. ఏదైనా అనుకోని కష్టమో, ప్రమాదమో ఎదురైతే నా వెనక ఇంతమంది ఉన్నారనే ధైర్యం ఉండదు. వాళ్ళు సహాయం చేస్తారా, చేయరా... అన్నది వేరే విషయం. ప్రపంచంలో ఒంటరివాళ్ళమవుతాం..ఇక అంతేనా... తర్వాత వారి పిల్లలకి కూడా ఆ బాధలు తప్పవు. మిగతా పిల్లలు నాన్నమ్మ, తాతయ్య, అమ్మమ్మ అంటూ అన్ని చెబుతుంటే అలాంటివన్నీ కోల్పోయిన వీరి మానసిక పరిస్థితి అనుభవించిన నీకు ఇప్పటికే అవగతమయి ఉంటుంది....' తన అనుభవా లన్నింటిని పూస గుచ్చినట్లు చెబుతూ అంది భారతి.

'శర్మ అలాంటి వాడు కాదమ్మా. చాలా మంచివాడు..నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు....'

'ప్రేమలో వీకల్లోతు కూరుకుపోయినపుడు ఇలాగే ఉంటుంది. ఇలా మతాలు వేరయితే ఇంకా కష్టం. వారి ఆచార వ్యవహారాలూ, మనవి చాల తేడా ఉంటాయి....ఇద్దరూ దూరంగా ఉండి , వయసు వేడిలో ఉన్నప్పుడు అవి ఎంత చిన్నగా కనబడతాయో...ఒక్కటై సహజీవనం చేస్తున్నపుడు అవే పెరిగి పెనుభూతాలై సంసారాల్నే నాశనం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఎక్కడికెళ్ళినా ఎక్కడో ఒకచోట చాదస్తం ఉన్న ఏ మామ్మగారో ఏదో అనక పోదు. మీ మనస్సులు భాధపడకపోవు....ఇలాంటి వెన్నో తట్టుకోవాలి...'

'అయినా...మాకు , మీ అనుమతి, ఆశీస్సులు ఉంటాయి కాబట్టి నాకు నీలాంటి బాధలుండవుగా..అఫ్ కోర్స్ శర్మ వాళ్ళది నిప్పులు కడిగే వంశమని ఒప్పుకోరన్నారు...'

'ఒప్పుకోరని తెలిసినప్పుడు ఎందుకు ప్రేమించాడు...'

'అమ్మా...అలా అన్నీ బేరీజులు వేసుకున్నాక పుట్టేది కాదు ప్రేమంటే. ఈ విషయం నా కన్నా నీకే బాగా తెలుసు...అనుభవజ్ఞురాలివిగా...'

'అందుకే నాలా నువ్వు బాధపడోద్దని చెబుతున్నా....ఇంతకీ పెళ్లి చేసుకుంటా నన్నాడా '

'ఏమో...ఎప్పుడూ అనలేదు... అయినా కాదనడు...మీరంటే ఇరువైపులా ఒప్పుకోక బయటకొచ్చేసారు....నాకు మీరున్నారుగా...'

'ఇంట్లో ఒప్పుకోరన్నాడు. పెళ్లి చేసుకుంటాను అనలేదు అంటున్నావు... మోసం కాదు కదా....ఇక నీకు మేమున్నది నిజమే కావచ్చు. కాని పెళ్ళయ్యాక నువ్వు నన్ను పరాయిదానివిగానే చూస్తావు... నాదగ్గర పది రూపాయలడగడానికి కూడా మొహమాటపడతావు. ఇప్పుడు నీ వయసెంతని? 18 ఏళ్ళు. అతనికెన్నేళ్ళు ?...ఉద్యోగంచేస్తున్నాడా?...'

'ఇరవై...డిగ్రీ చదువుతున్నాడు'

'ప్రతి సంవత్సరం ..కొన్ని లక్షల మంది డిగ్రీ పాసయి వివిధ కాలేజీ లనుండి బయటకొస్తున్నారు. ఇంకా ఎంతో చదవాల్సిన వయసు ఇద్దరిదీ. డిగ్రీకి ఏ ఉద్యోగం దొరకదు..'ఆకలి' ప్రేమ కన్నా ఎంత శక్తివంతమైనదో నీకు తెలీదు...ఒక్కసారి ఆలోచించు... ప్రేమ కడుపు నింపదు ..ముందు మీరనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి, కెరీర్ని మలుచుకోవడానికి తపన పడండి. ఇది చదివే వయసు. ఈ అవకాశం మళ్ళీ రాదు. ఇప్పుడు మంచిగా చదువు కుంటేనే రేపు జీవితాంతం హాయిగా ఉండొచ్చు... ఇప్పుడు పెళ్లి జంజాటం లో పడి 'ఎంజాయ్' అంటే, జీవితాంతం 'గోల్' చేరుకోలేక, పిల్లలతో ఆర్థికబాధలతో నరకంగా ఉంటుంది...ఒక్కసారి ఆలోచించు. ఎప్పుడైనా ఒక్క విషయం గుర్తుంచుకో...నీ మంచి కోరే వాళ్ళలో మొట్టమొదటి స్థానం లో మీ అమ్మానాన్న లుంటారని ...నిన్ను విమర్శించి సరైన దారిలో పెట్టాలనుకునే వాళ్ళు నీ ఆత్మీయులని తెలుసుకో... ఆత్మ విశ్వాసం మనిషికి పెట్టని ఆభరణం ...మీ కాళ్ళమీద మీరు నిలబడ్డాక, మీ ఈ నిర్ణయం లో ఎ తేడా లేకుండా ఉంటె, అపుడు మీ ఇష్టం. నీకు ఆలోచించే తెలివి ఉంది. తార్కా తర్కాలు ఆలోచించే విచక్షణా జ్ఞానం ఉంది. పెద్దవాళ్ళ మాట గౌరవించే వివేకం ఉంది. భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలో ప్రణాళిక ఉంది. నా కూతురు తెలివైన నిర్ణయం తీసుకుంటుందని నాకు నమ్మకం ఉంది. ఆ పైన ఆ భగవంతుని కృప....' ముగించింది భారతి.

అమ్మ చెప్పిందంతా సబబుగానే ఉండటంతో ఆలోచనల్లో పడింది సౌమ్య. ఇది భావితరానికి తొలి వేకువలా ఉంది.

-నామని సుజనా దేవి
7799305575.

రాచపుండు

ఎన్నో కల్లోలాలు
కాలం పై దాడి
మాటల యుద్ధాలు
విద్వేష చేదు రాగాలు
భవితను మరిచిన ఆలోచనలు.

కాలే కడుపు కనిపించదు
రాలే కన్నీరు కనిపించదు
కనికరించే మనసుల కరువు
భద్రత మాటల కరువు
భవిత అగమ్యం.

చల్లటి గాలి వీచి
చాన్నాలయ్యింది

ఇప్పుడు గాలికూడా
అందనంత దూరం
పురుగుల దూకుడు.

మెదడులు పనిని ఆపేసాయి
నోళ్ళన్నీ మూత
బలాలన్నీ విడిపోయి
ఆశలన్నీ తెగిపడి
ఒక చోటనే కుప్ప .

చిత్రం చూస్తూ
మౌనాల గాంభీర్యం

పతనం రాస్తూ
భవితల అనాగరిక పయనం

వీడలేని బంధీ గా
కాలం
కుట్రల్లో బంధీ

గాయం
మానకుండా
రాచుకునే రాచపుండు.

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

ఉద్యమ స్ఫూర్తి

ఊరు వాడ పల్లె పట్నం
సమరమై సాగింది
ఓరుగల్లు నేలిన
రాణి రుద్రమదేవి పౌరుషాన్ని
అవపోసన పట్టి
దేశ్ ముఖ్ ల దుశ్చర్యలను
ఎదురించిన చాకలి ఐలమ్మను
స్ఫూర్తిగా మలుచుకుని

సర్దార్ సర్వాయి పాపన్న
యుద్ధ తంత్రాల పటిమను తెలుసుకొని
సకల జనుల సమ్మెకు నగారా మోగింది
సబ్బండ వర్గాలు సమరానికి సై అనే

విద్యార్థులు ఉద్యమమే ఊపిరిగా
ప్రాణాలను ప్రణంగా పెట్టి
ముళ్లకంచెలనే పువ్వుల
బాటగా మలుచుకుని
అణిచివేతనే అస్త్రముగా చేసుకొని
రణరంగానికి మూల స్తంభాలుగా నిలిచిరి
కవుల కలం పట్టి
గాయకులు గళమెత్తి
కళాకారులు ధూమ్ దాములతో
దుమ్ము లేపి అలుపెరగని పోరాటం
సాధించుకునేలా సాగింది సమరం

ఎందరో అమరుల
ప్రాణాల త్యాగం ఫలితం
నేటి తెలంగాణం.

-చాపలమహేందర్
9949864152

కన్నీటి చారికలు

గోవా వినోదయాత్రలో పెను విషాదం
బుగ్గిపాలైన అమాయక కుటుంబాలు
అతివేగమే అయ్యింది మరణదండన
ప్రాణం ఖరీదు నిండైన నిర్లక్ష్యమే !

జనారణ్య భాగ్యనగర నడిరోడ్డుపై..
కారులోనే కామాంధుల ఘాతుకం
బాలికపై పైచాచిక ఘోర అత్యాచారం
మృగాళ్ళే చిదిమేసిన లేత బుగ్గలు !

వంద రోజుల యుద్ధ విధ్వంసాలు
శ్మశానాలవుతున్న ఉక్రెయిన్ ఊళ్లు
శత కన్నీటి చారికల రుధిర మరకలు
పుతిన్‌కెపుడు పుట్టునో సద్బుద్ధులు !

అందాల కశ్మీరంలో హత్యలు
ఉగ్రవాద ముష్కర దాష్టికాలు
హిందూ జనాల హాహాకారాలు
తూటాలకు వేయాలి అడ్డుకట్టలు
పోషించాలి పరమత సహనాలు !

ప్రాణాల్ని బలి కోరుతున్న ప్రేమలు
పరువు హత్యలే నిత్యకృత్యాలు
ప్రేమలే నూరుతున్నాయి కత్తులు
నాది కాని ప్రేయసినే నరికివేతలు !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పుస్తక సమీక్ష

యెర్రోజు పసిడి పలుకు శతకం

శతకం గురించి ఎన్ని పరిశోధనలు జరిపిన అసలు సిసలైన శతకానికి పునాది పడింది తెలంగాణలోనే అని చెప్పాలి .ఎందుకంటే పాల్కురికి సోమనాథుడు రాసిన "వృషాధిప శతకమే" మొట్టమొదటిగా ఒప్పుకోవాలి. తెలుగు సాహిత్యంలో అన్ని ప్రక్రియల కంటే విలక్షణమైన ప్రక్రియ శతకం.

శతకం అంటే వంద పద్యాల రచన . ప్రస్తుతం 108 పద్యాలు శతకం లో ఉన్నాయి. శతకం ముక్తకాలతో కూడిన రచన. అంటే ఇందులో పద్యాలు వేటికవే స్వతంత్రంగా కలిగిఉండడం శతక పద్యం యొక్క ముఖ్య లక్షణం. నాలుగో పాదం లో తప్పనిసరిగా మకుట నియమాన్ని కలిగి ఉంటుంది మకుటం అంటే "కిరీటం" అని అర్థం. భక్తి శతకాలు, నీతి శతకాలు, వైరాగ్య శతకాలుగా చెప్పుకోవచ్చు. వృత్తిరీత్యా అధ్యాపకులు అయిన శతక కర్త శ్రీ వెంకటేశ్వర్లు శతకంలో నీతి బోధకే పెద్ద పీట వేశారు శతకం లోని మకుటం "వసుధ కద్దము యేర్రోజు పసిడి పలుకు"

కవి వెంకటేశ్వర్లు గారు శతకంలో చెప్పదలుచుకున్న విషయాన్ని ఉదాహరణంగా చెప్పడం విశేషం .సరళ భాష, సుందరమైన శైలి కవి సొంతం. ఈ పద్యాలు చదువుతూ ఉంటే కవి చిత్తశుద్ధి కూడా కనిపిస్తుంది .ఆబాల గోపాలానికి అక్షరాల అందమైన శతకాన్ని అందించిన రచయిత గారు అభినందనీయులు.

"పైసలు లేనప్పుడివ్వడు చూసి పోడు/ పలకరించ
నెరుగనట్లు పారిపోవు/ అక్కరకు రాని వాడెట్లు నాప్తుడౌను " అంటూ(92 వ పద్యంలో)యెర్రోజు ఈ పద్యం అక్కరకు రాని చుట్టము జ్ఞాపకం చేస్తుంది.

ఇతర భాషల నేర్చుకో ఇంపుగాను/ మాతృభాషను కలలోన మరువవద్దు/వృక్ష అభివర్ణించాడు.

మెదిగిన మరుచునే వేర్లపెనెపుడు (108 పద్యం) అని మాతృభాష ప్రాముఖ్యతను చాటిచెప్పారు.

గురువుపై గౌరవం నేడు కురుచనయ్యే/ గురుశిష్యుల బంధం గుడ్డిదయ్యే..(26 వ పద్యం) లో నేటి కాలంలో గురువులకు ఇచ్చే గౌరవాన్ని

నేటి రాజకీయాల్లో నేతలంతా/ కులమతాలను రెచ్చగొట్ట



(పద్యం03)

చాప కింద నీరు విధానం/ (91)
కుడితిలో పడ్డ ఎలుకల అట్లు(45)

ఇలాంటి పద్యాలను యవ్వనంలో రాసినవి. అధ్యాపక వృత్తికి రాకముందు కవి రాశాడు. కవి వెంకటేశ్వర్లు గారు రాసిన ఈ పద్యాలు అన్నీ కూడా వాస్తవానికి దగ్గరలో ఉన్నట్లు అనిపిస్తుంది ఇలాంటి రచనలు మరెన్నో రావాలని కోరుకుంటూ అభినందనలు

పుస్తక ప్రతులకు:ఇ.జ్యోతిర్మయి
2 బి231/6 సూర్య నగర్ బి3
సీతారాంపూర్ కరీంనగర్ జిల్లా
చరవాణి: 9492557036

-యాదవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

అమ్మానాన్న లారాధించండి

నవమాసాలు మోస్తు
నరకయాతన పడుతూ
పురిటి నొప్పులను భరిస్తూ
పురుడును బోసి
నీకు జన్మనిచ్చి
పెంచి,పెద్దచేసి,చదివించి
నీ సంతోషమే
తన సంతోషమనుకొని
నీ కష్టమే
తన కష్టంగా భావించి
నీకు ఓనమాలు నేర్పించి
సక్రమ మార్గమును చూపించి
భవిష్యత్తుకు బాటలేసునమ్మ..!!
భద్రత కల్పించునమ్మ..!!

అమ్మ కడుపులోన
అంకురించినప్పుడు
అమ్మకిబ్బంది కల్గద్దని
అన్ని తానై సమకూర్చి
వారసుడు వస్తున్నాడని
కలలెన్నో కనుకుంటు
పడరాని పాట్లు పడుతూ
ప్రమాదం
జరగద్దని కోరుకుంటూ
పది నెలలు పడగాపులు కాస్తు
బయట పడగానే చూసి
పరవశించి పోతూ
కంటికి రెప్పలా కాపుకాస్తూ
రక్షణను అందిస్తూ
వెలుపట్టి నడిపిస్తూ
విలువలను నేర్పిస్తూ
వెన్నుదన్నుగా ఉంటూ
విజయానికి చేరువచేస్తూ
భరోసానిచ్చును నాన్న..!
ధైర్యాన్నందించును నాన్న..!!

తల్లిదండ్రులిన్ని చేస్తే
చివరి దశలోనా
చూసుకోవడం మానేసి
తిండిపెట్టకుండ వదిలేసి
కష్టాలకు గురిచేస్తూ
చిత్రహింసలు పెడుతూ
ఆశ్రమాలకు పంపిస్తున్నరు
వాళ్ళ ఉసురుబోసుకుంటున్నరు
ఊపిరిని తీస్తున్నరు.

గుర్తుంచుకోండి బిడ్డలారా
నలుసుగున్నప్పుడే
నిను నులిమివేస్తే
నీవు జన్మించే వాడివా

మానవ రూపం
పొందేవాడివా
ఇన్ని
అనుభవించే వాడివా
ఇకనైనా మారండి
మూస్కుపోయిన కళ్ళు
తెరవండి
ఓ కన్న బిడ్డలారా..!
అవసాన దశలోన
అమ్మ నాన్నలకు
అండగా నిలవండి
ఆనందాన్ని ఇవ్వండి
సేవలను చేయండి
చేయూతను ఇవ్వండి
శ్రమగా
భావించుకోకండి..!
ఆశ్రమాలకు
పంపించకండి..!!
కన్నబిడ్డల్లా చూసుకోండి..!
కంటికి రెప్పలా
కాపాడుకోండి..!!

-పసుల.శంకర్
(9542181301

కోతికి గుణపాఠం

(కథ)

ఒక కోతి ఒక కాలువను దాటవలసి వచ్చింది . కానీ ఆ కాలువలో ప్రవాహం ఎక

మహాకవి జాషువా జీవితం - సాహిత్యం

జూలై 24
జాషువా వర్ధంతి
సందర్భంగా..

సీ॥ ఇతడటే పార్వతీపతికి గబ్బిలముతో
సందేశమంపిన సత్కవీంద్రు
డితడటే 'ఫిరదౌసి' కృతిపతి గజనీ
డు
రాకృతింజాటిన అసఘుయశుడు
ఇతడటే 'ముంతాజు' స్మృతిచిహ్న
సౌందర్య
మభినుతించినయట్టి శుభగుణుండు
ఇతడటే 'నేతాజి' ధృతికావ్యశౌర్యము
తనరబల్కిన కవితల్లజుండు
ఈతడే పూజ్య 'బాపూజి' పూతచరిత
కొసరి, కొసరి పాడిన కవికోకిలమ్మ
ఈతడే 'క్రీస్తుచరిత్రమ్ము' ప్రీతిమీర
సరసగతి వాకొనిన కవిచక్రవర్తి
– పులఖండం సూర్యారావు

"జీవితంనాకు ఎన్నోపాఠాలు నేర్పింది. నాగురువులు ఇద్దరు. పేదరికం, కులమతభేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండోది నాకు ఎదిరించే శక్తిని పెంచిందేకాని బానిసగా మాత్రం మార్చలేదు అంటారు జాషువా–"

ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నల్గురు కుమారులనుట విన్నాము గాని
పసరమునకన్న హీనుడభాగ్యుడైన
ఐదవకులస్థుడెవ్వరమ్మా! సనిత్రి!

అంటూ దశాబ్దాలక్రితమే నిమ్నజాతులపట్ల జరుగుతున్న అన్యాయాలపై నిర్భీకంగా, నిరసనవాణిని వినిపించిన క్రాంతదర్శి–మహాకవి జాషువా! ఆంధ్రుడిగా, భారతీయుడిగా పుట్టినందుకు ఎంత పొంగిపోయాడో " తిరుగులేదు విశ్వనరుడనేను" అని ఎలుగెత్తిచాటటానికి అంతమురిసిపోయాడు.

అంతేకాదు "వడగాడ్పు నాజీవితమైతే వెన్నెల నా కవిత్వం" అంటూ తన జీవితం వడగాడ్పులా భగభగమండేదైతే, తన కవిత్వం వెన్నెలలా ఆహ్లాదాన్ని కలిగించేదని తన జీవితానికి – కవిత్వానికి ఉన్న తారతమ్యాన్ని నిష్కర్షగా నినదించాడు జాషువా!

20వ శతాబ్దపు పూర్వార్ధభాగంలో ఒకవైపంతా భావకవులుంటే మరోవైపు సామాజిక భావవిప్లవాన్ని కోరుతూ నిలబడ్డ కవి జాషువా ఒక్కడే. భావకవుల ఉద్ధృతిని తట్టుకొని నిలబడింది కూడా ఆరోజుల్లో జాషువాయే. సమాజంలో అగ్రవర్ణాలు అట్టడుగువర్గంపట్ల చూపిన నిరాదరణకు బాల్యం నుంచీ ఎదురు నిలిచి ప్రశ్నిస్తూ ముందుకు వచ్చినకవి. ఆయన తన సాహిత్యంద్వారా చేసిన తిరుగుబాటు, ప్రకటించిన నిరసన – ప్రతిఘటన ఉదాత్తమైనటువంటివి. న్యాయసమ్మతమైనవి కూడా.

జాషువా జీవిత నేపథ్యం :

జాషువా 1895, సెప్టెంబర్ 28న వినుకొండలో వీరయ్య, లింగమాంబలకు జన్మించాడు. జాషువా తండ్రి గుఱ్ఱం వీరయ్య యాదవకులానికి చెందిన హిందువు. తల్లి లింగమ్మ అరుంధతి కులానికి చెందిన క్రైస్తవురాలు. వీరిద్దరూ వినుకొండ మిషన్ పాఠశాలలో కలిసి చదువుకోవటంవల్ల ఇద్దరి స్నేహం ప్రేమగామారి పెళ్ళికి దారితీసింది. ఈపెళ్ళికి లింగమ్మ బంధువులవైపు నుండి మతపరమైన అడ్డంకులు తలెత్తడంవల్ల, హైందవుడైన వీరయ్య ప్రేమికురాలి కోసం తన కులమతాల్ని వదిలిపెట్టాడు. బాప్తిజం ద్వారా క్రైస్తవం స్వీకరించి లింగమ్మను వివాహం చేసుకొన్నాడు.

అయితే ఈ నేపథ్యంవల్ల జాషువాకి తల్లిదండ్రులు ఇరువైపు నుండీ పేదరికం సమానంగా సంక్రమించినా, కులం మాత్రం తల్లివైపునుండే నిర్ణయింపబడింది.

ఈ వీరయ్య–లింగమ్మలు ఇరువురూ మిషనరీ దొరల సహాయంతో క్రైస్తవ పాస్టర్లుగా తర్ఫీదుపొందారు. వినుకొండ చర్చిలో పాస్టరుగా నియమింపబడ్డ వీరయ్య తనకు పుట్టిన కుమారునికి "జాషువా'' అనే క్రైస్తవ పేరును పెట్టడం జరిగింది.

బాల్యం–విద్యాభ్యాసం :

జాషువా బాల్యం వినుకొండలోనే గడిచింది. అందరి పిల్లల్లాగే ఆయన జీవితం కూడా బాల్యంలో ఆటపాటల్లోనే గడిచినా మిగతా కులాల పిల్లల బాల్యానికి, జాషువా బాల్యానికి ఎంతో తేడా కనిపిస్తుంది. ఆనాటి సమాజం చిన్నపిల్లల మధ్య కూడా కులవివక్ష పాటించేలా చేసింది. ఇక బడిలో కూడా అస్పృశ్యత కారణంగా అతణ్ణి ఎక్కడో చివరబెంచీలో కూర్చోబెట్టడం ఆ లేత హృదయాన్ని గట్టిగా గాయ పరచింది.

జాషువా ప్రాథమిక విద్యాభ్యాసంచేసే రోజుల్లో చదువులో అంత చురుకుగా ఉండేవాడుకాదు. ఆటపాటలలో, బొమ్మలు గీయటంలో ఉన్న ఆసక్తి చదువుమీద ఉండేదికాదు. ఉన్నతవిద్యలోకి అడుగుపెట్టాక అతనిలో పట్టుదల హెచ్చింది. మార్పు వచ్చింది. 'నాకథ' 158వ పుటలో అస్పృశ్యతకు నిలయమైన హిందూ సోదరుల కళాలయంబున ఉన్నత విద్యకు చేరానని, అక్కడ హరిజన విద్యార్థులకు, ఇతర విద్యార్థులకూ మధ్య అడ్డుగా ఒక బల్ల ఉండేదని, హరిజనుల పుస్తకాలూ, పలకలూ పెట్టుకోవటానికి వేరేస్థలం ఉండేదని కూడ చెప్పుకొన్నాడు.

ఉద్యోగం – వివాహం :

ఉన్నతవిద్య ముగిసాక బాపట్లలోని అమెరికన్ బాప్టిస్టు ట్రైనింగ్ స్కూల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందాడు. స్వగ్రామమైన చాట్రగడ్డపాడులో మిషన్‌వారి ప్రాథమిక పాఠశాలలో బడిపంతులుగా చేరాడు. అంతకుముందే 1910లో జాషువాకి మేరీతో వివాహమయింది.

జాషువా సాహిత్య పరిశ్రమ చేయటానికి చాలా కష్టాలు పడ్డాడు. క్రైస్తవ మతాధికారుల దృష్టిలో హిందూ పురాణాలు చదవటం మహాపాపం. అందుకని రాత్రిపూట ఊరుకి దూరంగా ఉన్న పాడుబడ్డ మసీదులో గుడ్డిదీపపు వెలుగులో పురాణేతిహాసాలు చదువుకొన్నాడు.

జాషువా స్వతహాగా సంప్రదాయాభిమాని కావడంచేత ఆంగ్లసాహిత్యం కంటే, అవధాన ప్రభావమే ఆయనపై ఎక్కువగా ప్రసరించింది. తన స్నేహితుడైన దీపాల పిచ్చయ్యశాస్త్రితో కలిసి ఆశకవిత్వం చెప్పడం అలవాటు చేసుకొన్నాడు.

సంస్కృత కావ్యాలు ఎవరిదగ్గరైనా నేర్చుకోవాలని ప్రయత్నం చేసినా తన కులంవల్ల ఎవరూ నేర్పడానికి ముందుకు రాలేదు. ఎలాగో జూపూడి హనుమచ్ఛాస్త్రి అనే పండితుడు కాళిదాసత్రయాన్ని బోధించగలిగాడు. అయితే అప్పుడే జాషువా జీవితంలో కష్టకాలం ఎదురయింది.

కష్టకాలం : హిందూ మతగ్రంథాల్ని అధ్యయనం చేస్తున్నాడన్న నెపంతో మిషన్‌స్కూల్ నుండి జాషువా డిస్మిస్ చేయబడ్డాడు. దాంతో వచ్చే మూడు రూపాయల జీతం కూడా దూరమయింది. ఒకవైపు కవిగా రాణించాలన్న తపన, మరొకవైపు జీవిక కోసం ఒడిదుడుకులు జాషువాను కృంగదీసాయి.

కవిత్వం, ప్రణయకవిత్వం అంటూ భావకవులు ఊహా ప్రేయసినీ, ప్రకృతినీ వర్ణించడంతో మునిగిపోయారు. కాని జాషువా ఆదారిన పోలేదు. వాస్తవిక ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. భావకవుల్ని, వాళ్ళ ఊహాప్రేయసి వర్ణల్ని, పిచ్చిరోదనని ఇలా నిరసించాడు.

"కవి సమయంబుదప్పి, నుడికారపు సొంపును పాడుజేసి నీ
వెవతుక కోసమో, కుమిలి యేడ్చుచు చక్కని తెల్గుకైత కా
యువులు కుదించి, యేమిటి కయోమయ మున్‌బొనరింతు నీవు? నీ
కవనము పాడుగాను, వెడగా!

అంటాడు. అయితే పద్యవిద్యలో ఆరితేరిన కవిని ఇవేవీ ఆవలేవు. పద్యం అతడు చెప్పినట్లు వింటుంది. అతనివుందు వోకరిల్లుతుంది. అలా పద్యాన్ని లొంగదీసుకొన్న కవి జాషువా!

ఇక ఆతని రచనల్ని పరిశీలిస్తే మేల్తరమైన గబ్బిలం, ఫిరదౌసి, ముంతాజ్ మహల్ కావ్యాలు, అలాగే ఏడుభాగాలలో వెలువడిన ఖండకావ్యాలు, ఇవన్నీ ఆయన ప్రతిభా సంపూర్ణతను వ్యక్తం చేస్తాయి. మరీ ముఖ్యంగా గబ్బిలం.

గబ్బిలము

జాషువా హృదయం కరిగి జాలువారిన భావలహరి గబ్బిలం. "నగరివెలుపలి మాలమాదిగలు కూడ నరులు సుమ్మని దేశము గుర్తుపట్టుగల" చైతన్యాన్ని సామాజిక స్పృహను ఈ కావ్యం పాఠకులకు కలిగించింది.

ఒక పేదవాడు, పైగా అంటరానివాడు, దైవదర్శనానికి అనర్హుడిగా, తోటి మానవులే తృణీకరించే హీనస్థితిలో ఉన్నాడు. అలాగే అటు పక్షిజాతికి – జంతుజాతికి చెంది, రెంటికీ చెడిన రేవడిలా ఉన్న గబ్బిలం ఆయన దృష్టిపథంలో పడింది. అంతేకాదు గబ్బిలాన్ని ఒక వెలివేయబడిన ప్రాణిగా, లోకంలో మిగతా ప్రాణులన్నీ గుర్తిస్తున్నాయి.

ఈ లోకరీతిని పాటించే గబ్బిలాన్ని జాషువా పంచమజాతికి ఒక ప్రతీకగా గుర్తించాడు. దళితుల చీకటి బ్రతుకులకది ఒక సంకేతం. వారి దౌర్భాగ్యానికి అది ఒక చిహ్నం. అందుకే దాన్ని వార్తాహరునిగా స్వీకరించాడు.

మేఘసందేశ ప్రభావం :

కాళిదాసు మేఘసందేశాన్ని దృష్టిలో ఉంచుకొనే తానీకావ్యాన్ని రాసానని అంటాడు. అయితే పద్యవిద్యలో ఆరితేరిన కవిని ఇవేవీ ఆవలేవు. పద్యం అతడు చెప్పినట్లు వింటుంది. అతనివుందు వోకరిల్లుతుంది. అలా పద్యాన్ని లొంగదీసుకొన్న కవి జాషువా!

ఇక ఆతని రచనల్ని పరిశీలిస్తే మేల్తరమైన గబ్బిలం, ఫిరదౌసి, ముంతాజ్ మహల్ కావ్యాలు, అలాగే ఏడుభాగాలలో వెలువడిన ఖండకావ్యాలు, ఇవన్నీ ఆయన ప్రతిభా సంపూర్ణతను వ్యక్తం చేస్తాయి. మరీ ముఖ్యంగా గబ్బిలం.

గబ్బిలము

జాషువా హృదయం కరిగి జాలువారిన భావలహరి గబ్బిలం. "నగరివెలుపలి మాలమాదిగలు కూడ నరులు సుమ్మని దేశము గుర్తుపట్టుగల" చైతన్యాన్ని సామాజిక స్పృహను ఈ కావ్యం పాఠకులకు కలిగించింది.

ఒక పేదవాడు, పైగా అంటరానివాడు, దైవదర్శనానికి అనర్హుడిగా, తోటి మానవులే తృణీకరించే హీనస్థితిలో ఉన్నాడు. అలాగే అటు పక్షిజాతికి – జంతుజాతికి చెంది, రెంటికీ చెడిన రేవడిలా ఉన్న గబ్బిలం ఆయన దృష్టిపథంలో పడింది. అంతేకాదు గబ్బిలాన్ని ఒక వెలివేయబడిన ప్రాణిగా, లోకంలో మిగతా ప్రాణులన్నీ గుర్తిస్తున్నాయి.

ఈ లోకరీతిని పాటించే గబ్బిలాన్ని జాషువా పంచమజాతికి ఒక ప్రతీకగా గుర్తించాడు. దళితుల చీకటి బ్రతుకులకది ఒక సంకేతం. వారి దౌర్భాగ్యానికి అది ఒక చిహ్నం. అందుకే దాన్ని వార్తాహరునిగా స్వీకరించాడు.

మేఘసందేశ ప్రభావం :

కాళిదాసు మేఘసందేశాన్ని దృష్టిలో ఉంచుకొనే తానీకావ్యాన్ని రాసానని

ఇకనేనియు రమ్మదారికిన్
అంటూ భావకవుల మార్గాన్ని ఘాటుగానే విమర్శిస్తాడు.

జాషువా కవిత్వం

జాషువా జీవితం – కవిత్వం వేరువేరుకాదు. కవిత్వమే జీవితంగాను, జీవితమే కవిత్వంగానూ మలచుకొన్నాడు. నిమ్నోన్నతాల్ని రెంటినీ చూసాడు.

1924 నుండి 1965 వరకు అనగా సుమారు 41 సంవత్సరాలపాటు అనాథ, స్వప్నకథ, గబ్బిలం, ఫిరదౌసి, కాందిశీకుడు, నేతాజీ, బాపూజీ, స్వయంవరం, రాష్ట్రపూజ, కొత్తలోకం, ముసాఫరులు, నాగార్జునసాగర్ వంటి 7 ఖండకావ్య సంపుటాలు ముంతాజ్ మహల్, క్రీస్తు చరిత్ర – వంటి లఘు కావ్యాలు

చంద్రిక, కుశలవోపాఖ్యానం, చిన్నానాయకుడు వంటి గద్యకృతులు, రుక్మిణీ కల్యాణం, చిదానందప్రభాతం, ధ్రువ విజయం, వీరాబాయి, తెరచాటు వంటి పౌరాణిక సాంఘిక నాటకాలు రాసాడు. అసలు ఆయన స్వీకరించని వస్తువంటూలేదు. వీరి లభ్య రచనలన్నిటినీ మనసు ఫౌండేషన్ వారు ఒకే సంపుటిగా ముద్రించారు.

అసమసమాజం బాకులు కుమ్మినపుడు, అంటరానితనం విషాగ్నులు చిమ్మినపుడు, దుర్భరదారిద్ర్యం వెంటాడినపుడు, దురంత వేదన గుండెల్లో తుకతుక ఉబికినపుడు జాషువా గుర్తుకొస్తాడు. ఆతని ఫిరదౌసి గుర్తుకొస్తుంది. గబ్బిలం జ్ఞాపకానికి వస్తుంది. శ్మశానవాటి నిట్టూర్పు పొగలతో కట్టెదుట నిలుస్తుంది. ఇంకా ఎన్నో ఖండకృతులు ప్రతిఘటనకు ఓంకృతులై ప్రతిధ్వనిస్తాయి.

ఇక జాషువా వస్తువులో నవ్యతను చేపట్టినా దాని వ్యక్తీకరణకు మాత్రం పద్యాన్నే ఆయుధంగా ఎంచుకొన్నాడు. పద్యవిద్యలో జాషువా చేయితిరిగిన కవి. ఆయన పద్యాల్లో పరుగుంటుంది. పదునుంటుంది. గుండెను హత్తుకొనే గుణముంటుంది. పద్యం చదవగానే జాషువా బాణీ అని అర్థమైపోతుంది.

కేవలం గణ, యతి, ప్రాసల్ని కూర్చుకొంటూ పద్యం పూర్తిచేస్తే అది పద్య రచన అవుతుందేగాన పద్య విద్య అనిపించుకోదు. ఒక అద్భుతమైన, అందమైన పద్యం వెలికిరావాలంటే కవికి పద్యవిద్య తెలిసుండాలి. మంచి పద్యరచన ఒక ప్రసవవేదన లాంటిదంటాడు జాషువా. పద్యం రాయడం ఎంత కష్టమో చెబుతూ

"గణబాధరవ్వంత గడచి ముందుకు సాగ
తగ్గవోయని యతిస్థానమురుము
యతిని మచ్చికచేసి అడుగుముందుకు సాగ
ప్రాసంబు కుతుకత పట్టినిలుపు
ప్రాసవేదన దాటి పయనంబుసాగింప
భావంబు పొసగకిబ్బందిపెట్టు
భావంబు పొసగించి పద్యంబు ముగియింప
రసలక్ష్మి కినిసిమారాము సేయు
ఇట్టి ప్రతిబంధకములనెల్ల గడచి
గట్టుకెక్కుదమన్న వ్యాకరణశాస్త్ర
మాదరింపదు శబ్దమర్యాదగాన
రాక కవిగాని బ్రతుకు శ్రీరామ రామ--"

కావ్యరచనా ప్రేరక ముఖ్యాంశాన్ని జాషువా పేర్కొన్నాడు. మేఘ సందేశంలో యక్షుడు పంపినది ప్రణయసందేశం. ఇక్కడ అరుంధతీ సుతుడు పంపినది, మనసును కాల్చివేస్తున్న ప్రళయ సందేశం. పైగా యక్షునికి శిక్ష ఒక సం॥రం మాత్రమే. అరుంధతీ సుతునిది మాత్రం ఆజన్మాంత శిక్ష. యక్షుడు మన్మథాగ్ని తప్పుడు. ఇతడు క్షుధాగ్నితప్పుడు.

ఇతివృత్తం :

పీడిత తాడిత పంచమజాతికి ప్రతినిధిగా ఉన్న అరుంధతీ సుతుడు జీర్ణ శిథిల కుటీరంలో నివసిస్తుంటాడు. పెళ్ళిచేసుకొంటే మళ్ళీ పిల్లలు పుట్టి వాళ్ళుకూడా తనలాగే ఈ సమాజంలో అంటరానివాళ్ళుగా చూడబడతారని అతడు వివాహమే చేసుకోలేదు.

తనతోటి సోదరులెందరో ఇలా జీర్ణకుటీరాలలో, కుక్కి మంచాలపై ఉంటూ రోజుకూలీపై అర్థాకలితో మాడుతూ చావలేక బ్రతికే వారిని గమనిస్తాడు. మాజాతికి విముక్తిని ప్రసాదించమని ఓ గబ్బిలమా! నీవు వెళ్ళి నా తరుపున భగవంతునికి విన్నవించు, నేను ఆయనకు చెప్పుకుందా మంటే ఆ పూజారి నన్ను లోనికి రానీయడు అంటూ

"ఆలయంబున నీవు వ్రేలాడువేళ
శివునిచెవి నీకు కొంత చేరువుగ నుండు
మౌనె ఖగరాజ్ఞి పూజారిలేని వేళ
విన్నవింపుము నాదు జీవిత చరిత్ర"–

అంటూ గబ్బిలాన్ని అర్థిస్తాడు.

కర్మసిద్ధాంతంపై తిరుగుబాటు:

అంతేకాదు కొందరి కష్టతరమైన జీవితాలకి – మరికొందరి సుఖప్రదమైన జీవితాలకి కారణం కర్మ అని కొందరు వాదిస్తూ ఉంటారు. కానీ ఈ వాదన తార్కిక పరీక్షకి నిలబడదు. ఈ కర్మ సిద్ధాంతాన్ని గబ్బిలం కథానాయకునిపై ప్రయోగించి అతని నోరు కట్టేసారు. అసలీ కర్మసిద్ధాంతం ఏంటి? దానికి తనపై ఎందుకింత కక్ష? తెలుసుకొనిరమ్మంటూ

కర్మసిద్ధాంతమున నోరు కట్టివేసి
స్వార్థలోలురు నాభుక్తిసనుభవింత్రు
కర్మయననేమొ, దానికీ కక్షయేమొ
ఈశ్వరునిచేత ఋజువు చేయుంచవమ్మ

అంటూ జాషువా వారాసిన ఈ పద్యం పాఠకులకు ఎన్నెన్నో యోచనాలోచనలకు పురిగొల్పుతుంది.

వర్ణవ్యవస్థా నిరసన :

దోపిడీవ్యవస్థకు కారణమైన వర్ణవ్యవస్థను జాషువా గబ్బిలం కావ్యంలో తీవ్రంగా గర్హించాడు.

"ఈయభాగ్యుని ? రక్తంబు నాహరించి
ఇనుపగజ్జెల తల్లి జీవనముచేయు
కొసరిబుసకొట్టు నాతని గాలిసోక
నాల్గుపడగల హైందవ నాగరాజు"–

వాయుభక్షకుడైన నాగరాజు కూడ పంచముని గాలిసోకగానే కసరి బుస కొట్టడం ఒక అసాధారణ విషయం. రాత్రింబవళ్ళు రెక్కలు ముక్కలు చేసికొని తమ అభ్యున్నతికి శ్రమించే పంచముని సవర్ణ హిందువులు తమ పంచలకు కూడా రానీయరన్న విషయాన్ని ఇందులో జాషువా ధ్వనింపజేసాడు. అంతేకాదు

"వాని తలమీద పులిమినపంకిలమును
కడగి కరుణింపలేదయ్యె గగనగంగ–

అంటూ అస్పృశ్యుడైన పంచముణ్ణి ఆకాశగంగకూడ పవిత్రుణ్ణి చెయ్యలేక పోతున్నదని వాపోతాడు అంతేకాదు.

"వానినుద్ధరించు భగవంతుడేలేడు
మనుజుడెట్టువాని కనికరించు–"

అంటూ భగవంతుడే చిన్నచూపు చూసాడనే ఆవేదనను వ్యక్తం చేస్తాడు. అలాగే దేవతాకళ్యాణాల పేరుతో జరిగే అంతులేని వ్యయాన్ని గూర్చి

"ప్రతిమలపెండ్లి సేయుటకు వందలు
వేలు వ్యయింత్రుగాని దుః
ఖితమతులైన పేదల వకీరుల
శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పదీ భరతమేదిని
ముప్పదిమూడు కోట్ల దే
వతలెగబడ్డదేశమున భాగ్యవిహీనుల
క్షుత్తులారునే–" అంటూ నిలదీస్తాడు.

ఫిరదౌసి :

ఇందులో జాషువా వర్గ స్పృహ బాగా కనిపిస్తుంది. సమాజంలో రెండువర్గాలు ఉంటాయి అన్న విషయం వర్గ స్పృహ కలిగిన ఏకవికైనా ఇట్టే తెలుస్తుంది.

ఒకటి దోపిడీ చేసేవర్గం. రెండోది దోపిడీకి గురికాబడే వర్గం. దోపిడీ చేసే వర్గాలు రాచరిక – భూస్వామ్య – పెట్టుబడిదారీ భావజాలంతో దోచుకొంటాయి. ఈ భావజాలంమీద జాషువాకి విపరీతమైన ఆగ్రహం ఉంది. ఆ ఆగ్రహాన్ని అనేకచోట్ల ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వ్యక్తీకరిస్తాడు.

రాచరికానికి దురహంకారం, దుర్మార్గం, ఎంతగొప్ప ప్రతిభావంతుణ్ణైనా బానిసగా భావించటం, ఇలాటివన్నీ ప్రధానమైన లక్షణాలు. వీటన్నిటినీ జాషువా పిరదౌసి కావ్యంలో తుత్తినియలు చేసాడు.

ఒక్కొక్క పద్యానికి ఒక్కొక్క బంగారు నాణాన్ని ఇస్తానన్నరాజు కావ్యమంతావిని ఎంతోమెచ్చుకొని, స్పందించి చివరికి వెండినాణాలు పంపాడు. కుంగిపోయిన ఫిరదౌసి, ధనం తిప్పి పంపేసి, చాలా ఆగ్రహంతో రాజుకి ఉత్తరం రాసాడు. ఆ ఉత్తరంలో కవికి రాచరికంమీద ఉన్న కోపం వ్యక్తమవుతుంది. ఈ పద్యాలు "ఫిరదౌసి" కావ్యానికి ఆత్మలాంటివి. ఎందుకంటే ఈ కావ్యంలో రాచరికంలోని దుర్మార్గలక్షణాల్ని నిరూపించడమే మహాకవి లక్ష్యం కాబట్టి. అంటాడు. రాజుని బానిస అనటం రాచరికాహంకారానికి ఎంత ఎదురుదెబ్బ. ఇలా రాచరిక లక్షణాలమీద ఉన్న తన ఆగ్రహాన్నంతా, ఫిరదౌసి కవిమీద పెట్టి, జాషువాకవి వ్యక్తపరిచాడు.

ఖండకావ్యాలు :

ఖండకావ్యాలనగానే జాషువాయే గుర్తుకొస్తాడు. ఇవి మొత్తం ఏడు సంపుటలు. ఈ ఏడు సంపుటాల్లోను సుమారు 200 అంశాల మీద ఆయన స్పందనలు కనిపిస్తాయి. ఆయన తీసుకొన్న వస్తువుల్లోని వైవిధ్యం భావకవితా యుగంలో మరే కవిలోనూ కనిపించదు. పురాణ, చారిత్రక, సమకాలీన సంఘటనల మీద తన ప్రతిస్పందన నుండి రష్యావారు ఆకాశంలోకి పంపిన 'లైకా' అనే కుక్కపిల్ల, ప్రకృతి సౌందర్యం, పశుపక్ష్యాదులు, రేడియో, ద్వారంవారి ఫిడేలు, చీట్లపేక ఇలా ఎన్నో అనుదిన అనుభావాల దాకా ఆయన తీసుకొన్న వస్తువిస్తృతి చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది.

బాపూజీ:

స్వాతంత్ర్యోద్యమంలో బాపూజీ ప్రభావానికి లోనుకాని కవి అంటూ వుండడు. జాషువా కూడ ఆ ప్రభావంలో బాపూజీ అనే ఖండకావ్యం రాసాడు. కవులేకాదు. పిల్లలు మొదలుకొని పెద్దలదాకా మహాత్ముని ప్రభావానికి ఎలా లోనయ్యారో చెబుతూ

ముసలమ్మ మొదలుగా పసిపాపవరకు
ఖ
ద్దరు బట్ట నెమ్మేన దాల్చినారు
పాలకుదాదిగా బంట్రోతు వరకు గాం
ధీటోపి ధరియించి తిరిగినారు
ధనికుండు కోలె ముద్దకు లేని పేదయు
కడగి సన్నని నూలు వడికినారు
ఆస్తికుండును వీరనాస్తికుండును గూడ
బాపూజికంజలి పట్టినారు.
గాంధి నామకంబు గాంధి సందేశంబు
మారు మూలలందు మారుమ్రోగె
ఖండ పంచకమును గెగిలించిన వాని
సీమశక్తులేమి సేయగలవు?

అంటూ మహాత్ముని ప్రభావాన్ని వివరించారు.

ముంతాజ్ మహల్:

ఇక జాషువా రచించిన ముంతాజ్ మహల్ ఒక అపురూప దాంపత్య ప్రణయానికి ప్రతీక. ప్రబంధ కవుల అతివేల శృంగారంగాని, భావకవుల అమలిన శృంగారంకాని కాదిది. కాని ఒక అద్భుతమైన ప్రేమభావన. ముంతాజ్–షాజహాన్‌ల ప్రణయాన్ని గూర్చి ఇలా అంటాడు.

ఆ సతీ సతుల గాఢాశ్లేషముల నుండి
జారిపోయిన నిమేషంబులేదు
ఆ దంపతులకు నాహ్లాదంబుగూర్పక
తొలగిన వెన్నెల తునకలేదు
ఆ ప్రేమజీవుల యనురాగ వృద్ధికై
రుతమొనర్చని పరభృతములేదు
ఆ శుభాకృతుల నెయ్యంపు ముద్దులచేత
తీపికెక్కని ద్రాక్ష తీగలేదు.
అవధిలేని వారి ఆనందకేళికి
తోడుపడని పూలతోటలేదు
వారికూర్మి పెంపు వలచి వర్ణన జేసి
సుప్రసిద్ధిగనని సుకవిలేడు

అంటూ ఆదంపతుల ప్రణయ భావనలకు ఈ పద్యంలో 'జారిపోయిన' అనే క్రియాపదం ఎంతో భావధ్వని కలిగి ఉంది. జారిపోవడం మానవ చైతన్యానికి సంబంధించిన పదం. అనుబంధాన్ని వ్యక్తంచేసేపదం. వాడు ఇక్కణ్ణించి జారిపోయాడు అన్న ప్రయోగంలో అనుబంధం లేకపోవడాన్నే చెబుతుంది. పై సందర్భంలో అనుబంధాన్ని వర్ణిస్తూ, "నిమిషాలు కూడ జారిపోలేదు" అంటూ అర్థస్ఫూర్తితో గూడిన క్రియాపదాన్ని ప్రయోగించాడు జాషువా. అంతేకాదు ముంతాజ్ మరణానంతరం మహారాజు ఒక ఉన్మత్తునిగా రేయిపగలు నిద్రాహారాలు మానేసి నీవు స్వర్గానికెళ్ళినా నేను లేకుండా సుఖపడలేవంటూ భార్యను.

జీవరత్నంబవగు నిన్ను స్వీకరించి
వట్టి రతనాలు నాయింట వదలినాడు
యిచ్చి బులిపించి క్రమ్మరపుచ్చుకొనుట
యేటికలవాటు చేసెనో ఈశ్వరుండు–

అంటూ బాధపడతాడు. అంతేకాదు.

"నిన్ను ఉదరంబులో దాచుకొన్న మహికి
రత్నగర్భాఖ్యనేడు సార్థకమయ్యె–"

అని భూమికి రత్నగర్భ అనే పేరు ఎలా సార్థకమయిందో చెప్పుకొంటాడు. అయితే ఎంత విలపించినా ఏమి ప్రయోజనం? అందుకే ఆమె స్మృతిచిహ్నంగా అందమైన తాజ్‌మహల్‌ని నిర్మింపజేస్తాడు.

కీర్తివనవాటి–శ్మశాన వాటి :

అస్పృశ్యత అనేది కనిపించని వినిపించని చోటు శ్మశానవాటి. అందుకే జాషువాకి ఈ చోటంటే చాలా ఇష్టం.

"ఇటనస్పృశ్యత సంచరించుటకు తావేలేదు"– అంటాడు. అంతేకాదు రాజైనా, పేదైనా కవైనా, కళాకారుడైనా, అగ్రకులస్థుడైనా – నిమ్నజాతీయుడైనా కడకు ఇక్కడకు రావల్సిందే అని చెబుతూ

"ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని
కలము నిప్పులలోన కరిగిపోయె
ఇచ్చోటనే భూములేలు రాజన్యుల
అధికారముద్రికలంతరించె
ఇచ్చోటనే లేతయిల్లాలి నల్ల పూ
సలసౌరు గంగలో కలసిపోయె
ఇచ్చోటనెట్టి పేరెన్నికం కనుగొన్న
చిత్రలేఖకుని కుంచియనశించె
ఇది పిశాచులతో నిటలేక్షణుండు
గజ్జెకదిలించి యాడు రంగస్థలంబు
ఇది మరణదూత తీక్షణపౌ
దృష్టులొలయ
అవని పాలించు భస్మసింహాసనంబు

అంటాడు. ఈ స్మశానవాటి పద్యాలు బలిజేపల్లి హరిశ్చంద్ర నాటక ప్రదర్శనల్లోకి, ప్రేక్షక హృదయాల్లోకి చొచ్చుకొనిపోయాయి.

ఇంకా జాషువా ఉపాధ్యాయుని జీవితాన్ని గూర్చి ఉపాధ్యాయుడు అనే ఖండికలోను, స్వాతంత్ర్యోద్యమాన్నిగూర్చి భరతమాత, హిందూరమ ఖండికల్లోను సుభాష్‌చంద్రబోస్‌ని గూర్చి నేతాజీ ఖండికలోనూ వర్ణించడం జరిగింది.

ఇక నాకథలో కులం వల్ల కలిగిన అవమానాన్ని బాల్యంలో ఎలా ఎదుర్కోవలసి వచ్చిందో చెబుతూ

"వినుమొకనాడు నేను పురవీధిని పోవుచునుండ వైశ్యసం
దనులొ ధరామరాత్మజులొ నన్గని ముట్టకు మంచు వెన్కకున్
జనిరపుడేను కోపమున నల్వురి ముగ్గురిగొట్టి పేరెయె
త్తిన ఘటనంబు నేడును మదింబెడ బాయదు దొడ్డగాయమై"–

అంటాడు. లేతమనసులో పడిన ఆముద్ర జీవితాంతం వెంటాడగా ఇలా వీడియో తీసినట్లుగా పద్యాన్ని వ్రాసాడు.

రైల్లో సంఘటన – ప్రతిఘటన చైతన్యం

ఒకసారి జాషువా రైల్లో ప్రయాణిస్తూండగ, ప్రక్కన కూర్చున్న ఒక వ్యక్తి జాషువా పద్య రచనాశక్తికి అబ్బురపడి మీదేకులమని అడిగాడు. పంచముడనని జాషువా చెప్పగానే అతడు ఒక్కసారిగ అక్కడినుండి లేచిపోయాడు. ఆ సంఘటన జాషువాని కలచివేసింది. ఇలా అంటాడు.

నా కవితావధూటి వదనంబు
నెగాదిగజూచిరూపురే
ఖాకమనీయ వైఖరులగాంచి భళీయని
యన్నవారె మీ
దేకులమన్న ప్రశ్నవెలయించి చివాలున
లేచిపోవుచో
బాకునగ్రమ్మినట్లగును పార్థివచంద్ర
వచింప సిగ్గుగున్–

గవ్వకు సాటిరాని పలుగాకుల మూకలసూయచేత న
న్నెవ్విధి దూరినన్ నన్వరించిన
శారదలేచిపోవునే
ఇవ్వసుధాస్థలిన్ పొడమరె
రసలుబ్దులు గంటమూనెదన్
రవ్వలురాల్చెదన్ గరగరల్‌పచరించెద
నాంధ్ర వాణికిన్.

అంటాడు. అంతేకాదు.

ఇక జాషువా కృతజ్ఞతాభావం మెండుగాగల మూర్తి. బెజవాడలో తనకాలికి గండపెండేరంతొడిగిన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగార్ని గూర్చి

నాకన్నన్ మొనగాండ్రు సత్కవివరుల్
నాకన్న విద్యానిధుల్
నాకన్నన్ రుచిగా దెలుంగు కవితల్
కల్పించువారుండగా
నాకీబంగరు గండపెండియరమున్
బాదాన గీలించి పె
న్నాకీనాతల నిల్చినాడవు గద
బెజ్వాడాపుర గ్రామణీ!

అంటూ ప్రస్తుతిస్తాడు.

ఇక క్రొత్తలోకం అనే లఘుకావ్యంలో ప్రేమరాహిత్యం, విశ్వాసరాహిత్యం, అవినీతి, స్త్రీ పురుషుల విషయంలో వర్ణవిభేదాల విషయంలోని ద్వంద్వ నీతిని ఎండుగడుతూ ఎన్నో పద్యాల్ని వ్రాసారు జాషువా. స్త్రీవాదం అన్న ఊసేలేని ఆరోజుల్లో

స్త్రీకంటెన్ పురుషుండు శ్రేష్ఠుడనుచున్
సిద్ధాంతమున్ జేసి, తా
టాకుల్ కంఠములెత్తి స్త్రీజగతి
కన్యాయంబుగావించెనో
యేకాలంబున్ పుట్టినింటయిన
లేవేనాటి స్వాతంత్ర్యముల్

స్త్రీకీమారు సమానగౌరవ విభూతి

వైభవంగా సినారె అవార్డుల సభ

'సారస్వత మహీధరం సినారె' పేరుతో, తేజస్విని కల్చరల్ అసోసియేషన్ - తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో, జూలై 12న రవీంద్రభారతిలో సినారె పురస్కారాల సభ వైభవంగా జరిగింది.

సుప్రసిద్ధ సినీ నేపథ్యగాయని, పద్మభూషణ్ పి. సుశీల కు, ఇండియన్ ఐడొల్ గాయకుడు రేవంత్ కు సినారె సంగీత జీవన సాఫల్య పురస్కారాలను అందజేశారు. ప్రముఖ కవి, సినీగీత రచయిత మౌనశ్రీ మల్లిక్ 'సినారె సాహిత్య పురస్కారం', సేవా భువన సమ్రాట్ అవార్డును ప్రణీత్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కామరాజు నరేంద్ర కుమార్, సినారె ఆత్మీయ పురస్కారాలను సి.హెచ్. శ్రీనివాసరాజు స్వీకరించారు.

సీనియర్ జర్నలిస్టు పి. విజయబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా మాజీ మహారాష్ట్ర గవర్నర్ సి. విద్యాసాగర్ హాజరయ్యారు. సంగునూరి చంద్రశేఖర్ జ్యోతి ప్రకాశనం గావించారు.

గౌరవ అతిథులుగా గాయకుడు గంగాధర శాస్త్రి, వంశీ రామరాజు, ప్రముఖ నటి శివ పార్వతి, కాలేరు రామోజీ విచ్చేశారు.

విద్యాసాగర్ మాట్లాడుతూ "పి. సుశీల సినిమా పరిశ్రమకు ఎనలేని సేవలు అందించారు. ఆమె గానం మధురాతి మధు రంగా ఉంటుంది. ఆమె దేశం గర్వించదగ్గ గాయని, భారతరత్న అవార్డుకు నిజమైన అర్హురాలు. సింగర్ రేవంత్ ప్రతిభావంతమైన గాయకుడు. అలాగే సహస్ర గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ సినారె సాహిత్య పురస్కారానికి అర్హుడు" అని కొనియాడారు.

సభాధ్యక్షుడు పి. విజయబాబు మాట్లాడుతూ "సుశీల గారు ఎవరితోనూ పోల్చలేని అత్యున్నతమైన గాయనీయమణి, లతా మంగేష్కర్ గారికి ఏమాత్రం తగ్గని ప్రతిభ తనది" అని అన్నారు. అనంతరం గాయకుడు గంగాధర శాస్త్రి మాట్లాడుతూ.."సినారె ప్రపంచస్థాయి కవి, జీవన తత్వాలను పలికించినటువంటి సర్వోన్నతమైన మహాకవి" అన్నారు.

సుశీల స్పందిస్తూ.. "సినారె పాటల్లో దీపానికి కిరణం ఆభరణం అనే పాట తనకి ఎంతో ఇష్టం, నారాయణ రెడ్డి పేరుతో జీవన సాఫల్య పురస్కారం స్వీకరించడం మహాభాగ్యం, సినారె నాకు ఎంతో ఇష్టమైన కవి, అయితే అందరూ నాకు భారతరత్న అవార్డు రావాలని కోరుకుంటున్నారు. కానీ నాకు ప్రజల గుండెల్లో ఉన్న స్థానం కంటే ఏ అవార్డు పెద్దది కాదు." అన్నారు.

ప్రముఖ గాయకుడు, గాన సవ్యసాచి ఎస్. బి. సుధాకర్, సంస్థ ప్రధాన కార్యదర్శి రాణి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో సినారె సినీ గీతాల విభావరి ప్రేక్షకులను అలరించింది. ఎస్. బి. సుధాకర్, సురేఖ మూర్తి, విజయలక్ష్మి, శివశంకరి గీతాంజలి, సత్యభామ స్వాతి, మమన్ కుమార్ వంటి ప్రముఖ గాయనీ గాయకులు ఈ వేడుకలో గానం చేశారు.

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన గాంధీ ప్రేక్షకులను సందర్భోచితంగా ఆహ్లాదపరిచారు.

మేచ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 589 వ రోజు 'బోనాలు' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'బోనాలు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు

మేచ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

అరో మహాసాగరం

ఆకాశం నుండి వర్షధార
వీధుల్లో ప్రవహిస్తున్న భక్తిసాగరం
చినుకూ చినుకూ
కలిసి మహాప్రవాహం
అడుగూ అడుగూ
కలిసి మహాసాగరం.
వానబొట్టు చప్పుడు
అనుగుణంగా మహిళల పదనాదం
ఉరికీ ఉరికీ గజ్జెల రవళి
పోతరాజుల అడుగులు
అనునాదంతో చిల్లులు పడ్డ
మింటి నుండి జలధార
శివసత్తుల పూనకంతో
భయపడ్డ ఆకాశం బాలుడి చెమట వర్షం.
నదులన్నీ
సముద్రంలో కలిసినట్టు
జనసందోహమంతా
భక్తిసాగరంలో మిళితం
నేలపై ఎవరికో
వేపకొమ్మల వైద్యం
హడలెత్తిన వరుణుడు
మహిళల బోనంలో గింజగా రూపాంతరం
భవిష్యవాణి ముచ్చట్లలో
ఆశలుగా ప్రతిఫలనం
లౌడ్ స్పీకర్ల సంభాషణలకు
టప్ టప్ ప్రత్యుక్తి
తెలంగాణ వీధి వీధి
అలలు అలలుగా
భక్తిప్రవాహం
జనసందోహం
అరో మహాసాగరం.

-డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు

శక్తి ప్రదర్శన

చినుకులలో బోనాల పండుగ
వణుకుతూనే ఉంది నగరం నిండుగా!
వెడల్పాటి పదనాలు విశాలమైన కళ్ళు
ధృఢమైన శరీరాలు కాంతిమోసే కురులు
బోనాల సంబరాలు అనాదికళలు
ఆదిశక్తి ప్రదర్శనతో అపురూప దృశ్యాలు.
గ్రామీణ నైవేద్యం గ్రహబాధలు తొలగించే
సాకపోసే పసుపు కుంకుమల వెదజల్లే
దుష్టులపై వీరత్వమే
పోతురాజులూ అమ్మోరి సిగం
వేపాకు గుగ్గిలం ధూపం క్రిమి సంహారం !!
ఋతువుమారిన ప్రకృతి విశ్వరూపం
శాంతినీపజేయు సకల జనావరణం !!.
తలకెత్తిన బోనాలు కళాత్మక కావ్యాలు
గోల్కొండ గండదీపాలు కట్టమైసమ్మ
ఎల్లవ్వ పోచమ్మ, ఉజ్జయిని మాంకాళి
శాలిబండలో ముత్యాలమ్మ శివ సత్తులు
అన్నీ కలిసిన అద్భుతం బోనాల పండగ !!.

-ఎం. వి. ఉమాదేవి

పేర్లేవైతేనేం..

మైసమ్మ ఎల్లమ్మ
పోచమ్మ పెద్దమ్మ ఈదమ్మ
పేర్లేవైతేనేం
గ్రామాన్ని పాలించే గ్రామదేవతలే
ప్రకృతికి ప్రతీకగా
గ్రామదేవతలకు పూజలు
వర్షఋతువు ఆరంభ సూచనగా
ఆషాఢ మాసపు బోనాలు
గ్రామ దేవతలందరూ
రాయి గానో తరువుగానో
తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బోనాలు
గోల్కొండ బోనాలతో
ఉత్సవాలు ప్రారంభం
నగరంలోని బోనాలు
పాత పట్టణంలో బోనాలు
లష్కర్ ఉజ్జయిని
మహంకాళి బోనాలు విశిష్టమేగా
తెలంగాణ జీవనవిధానంతో
మమేకమైనవి బోనాలు
తెలంగాణ అంతటా శ్రావణమాసపు బోనాలు
బొట్టు బోనం శివాలు

సందడే సందడి

పల్లవి: బిందెమీద బిందేబెట్టి
వేపాకుల తీగలల్లి
మైసమ్మ కు బోనమేసి
సందడి చేసి నిలపండి
ఆడవే పాడవే
చిన్నా పెద్దా చేయి కలిపి ఆడరే.

చరణం1 : సద్దన్నం పెట్టినాను
చల్లంబలి చేసినాను
సంబరాల్లో అంబమాత
ఆశీస్సులు ఇవ్వమ్మా
మా పిల్లల నవ్వులు
నీవయ్యి నిలపమ్మ
ఆడవే పాడవే
చిన్నా పెద్దా చేయి కలిపి ఆడరే
చరణం 2: పెరుగన్నం పెట్టినాను
పాయసమ్ము చేసినాను
నీకే నివేదనగా
అర్పణ చేసినాను
ఆడవే పాడవే
చిన్నా పెద్దా చేయి కలిపి ఆడరే.

-వి.సంధ్యారాణి

బోనాల జాతర

బోనాల పండుగ
బోనమెత్తేరు నిండుగా
అమ్మవారిని కొలిచేరు మెండుగా!!
తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం
ఆషాఢ మాసం
అమ్మోరికి బోనం
గోలకొండకోట జగదాంబతో శుభ ఆరంభం
ఉజ్జయిని మహంకాళికి ఉత్సాహంగా
లాల్ దర్వాజ సింహవాహినికి
వైభోగంగా
స్వర్ణ రజత మృణ్మయ పాత్రల్లో
అమ్మకు నిండుగా బోనం
పసుపు కుంకుమలు పెట్టి
వేపకొమ్మలే అందంగా చుట్టి
దీపాలు భక్తితో వెలిగించి
పట్టు బట్టలే చక్కగా కట్టి
ఆభరణాలను ధరించి
అందంగా ముస్తాబై
తలమీద బోనమెత్తి బిడ్డ
గుడికి పోవు భక్తి పొంగార
చల్లని చూపుతో కరుణించు తల్లి!!
శివసత్తుల రంగం
పోతరాజు విన్యాసం
డప్పుల దరువుల మారుమ్రోగ
భవిష్యత్ వాణితో
జరుగబోయే సంఘంటనలు
విందు వినోదం
భక్తి పారవశ్యం
ఆరోగ్యం ఆనందం
అమ్మకు భోజనం
అంగరంగ వైభవం
ఆషాఢ మాస బోనం
లోక కల్యాణం కోసం
అమ్మవారి అనుగ్రహం
కోరుదాం అందరం!!

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

గ్రామదేవతలు

సమైక్య స్ఫూర్తి కి దర్పణం
సంస్కృతి పరిరక్షణం
సర్వేజనా సుఖినోభవంతు
అమ్మవారి ఆశీస్సులు
ఊరంతా సందడి
వైజ్ఞానిక కలబోత
పసుపు పూతలు
వేప ఆకులు
మండే దీపాలు
సమిష్టి బోజనాలు
ఇచ్చే ఆనందాలు
పోగొట్టు వ్యధలు
పోతరాజుల విన్యాసాలు
బైండ్ల గావులు
డప్పుల మోతలు
ముస్తాబుల ముత్తైదువలు
గ్రామాలను రక్షించుమంటూ
పాటలు
భవిష్య వాణి చెప్పే శివసత్తులు
మైసమ్మ,పోచమ్మ,పోలేరమ్మ
గ్రామ దేవతల అనుగ్రహం
పవిత్రంగా బోనాలు
ఎత్తుకొని శిగం వచ్చే
సందర్భాలు
దైవత్వం తో కూడిన
ఊరు పండుగ
తెలంగాణ సొంతం
శాస్త్రీయతతో కూడిన
ఆధ్యాత్మిక మేళవింపు.

- వి.శేషారావు

మాతంగులు పోతరాజులు జోగినీలు
తెలంగాణ పండుగలుగా విశ్వవ్యాప్తం
పశువులకు పంటలకు కుటుంబాలకు
రక్షణగా గ్రామదేవతలు
పంటలు పండితే
గ్రామదేవతలకు నైవేద్యం
పశువులకు అనారోగ్యమైతే
గ్రామదేవతలకు మ్రొక్కులు
జీవనశైలిలో
అనునిత్యం సాకంటూ పూజలు!.

-లక్ష్మారెడ్డి పసుల

ఊరి పండుగ

ఊరడి ఉత్సవం
ఊరి జనుల సందడి
ఆషాఢ మాసం ఆడపడుచుగా
అమ్మవారి రాకతో
జుల్తాలె 24, జాషువా వర్ధంతి
అంగరంగ వైభవమే
ఆనంద నిలయమే
మెరుపులా మెరిసిన పుట్టినింట
చక్క పొద్దున లేచిన చక్కనమ్మలంతా
గడపలన్నీ దిద్దేరు పసుపుకుంకుమలతో
పుడమిన సింహవాహిని
పూజలందుకునే సమయమని
మురిసిన వేపాకు తోరణాలై మెరిసే
ఘట స్వాగతానికి వేళయిందని
పచ్చికుండ మెరియునెంతో ప్రాణమొచ్చి
బొట్ల బొట్ల కుండ బోనాల కుండగా
వేపాకుల నడుమ అందంగా ఊరేగబట్టే..
ముద్దబంతి మాలలు
ముచ్చటైన సిరి కాంతులు
దరువేసిన డప్పులు
చిందేసిన కాలిగజ్జెలు
లాల్ దర్వాజా
నయాపూల్
అంగరంగ వైభవం
ఆనంద సాగరం
నిండారా నిమ్మల దండలు
శివసత్తుల పూనకాలు
పోతురాజుల ఆటలనడుమ
బైలెల్లినాది బ్రతుకు నిలిపే తల్లి...
ధూపం దీపం యాటల ఫలహారం
కన్నుల పండుగే
అమ్మవారి ఊరేగింపు
ఆడబిడ్డల చేతుల్లో
అందంగా ముస్తాబై
ఆనందంగా కదలగా
బోనం జ్యోతి దేదీప్యమానమై
రంగాన రందులు తొలగాలని
పోతురాజు వీరంగం నడుమ
శాకం పాకం
తొలి బోనం నైవేద్యమే
శక్తి తల్లుల దీవెనలకై
కరువన్నది లేక
కంటికి రెప్పోలే కాపాడాలంటూ
చీడపీడల తరిమి
చిరునవ్వులు కురిపించాలని
అంగరంగ వైభవంగా
గ్రామ దేవతల ఆరాధన
పున్నమి రాతిరి జోల పాటల్లో
ఊయల తొట్టెల్లో కొలిచేరు
చల్లని తల్లుల్ని
ఐక్యతకిది వేదికగా
అమ్మకు అన్నం
పాశం బువ్వల నైవేద్యంగా
ధూపం దీపం
పాకం శాకం పెట్టి
అన్నపానాదులుకు లోటురావద్దని
కొలిచేటి జగన్మాత కొలుపు
అంబరమైన సంబరాల తోడుగా
ప్రకృతిమాత ప్రసన్నానికై
పిల్లాపాపలతో
పాడిపంటలతో
చల్లగుండాలని శక్తిని కొలిచే
ఊరి పండుగ..

- శ్రీలతరమేశ్ గోస్కుల

ఆషాఢ హరివిల్లు

ఆషాఢ హరివిల్లు
అందాలు నింపుకొని
ఆనందంతో అరుదెంచే ఆషాఢమాసం
అమ్మరాక అవనికే పండగ
ముదితలందరి ముంగిళ్లు
ముగ్గులతో నిండగా
పూవుల పానుపులు
అమ్మ రాకకై ఎదురు తెన్నులు
వనితలందరు రంగు రంగుల దీపకళికలు
మధ్యలో మాఅమ్మ
ఎల్లమ్మ బోనం తో ఆవేశం
ఆనంద గీతాలాపనల అతివలు
డప్పుల దరువులతో తప్పెట్లతాళాల
నాట్యాలు
నీ దయ మాపై కురుపించుమమ్మా!
పసుపు నీరు
వేపాకు రెమ్మల ఝల్లులు
నశించే వ్యాధులు
ధరణిలో సంతోషాలు
నిను చేర వచ్చెదమమ్మా
ఆదరించమ్మా
కాపాడు మాఅమ్మ
కరుణతో తల్లీ.

- కె.కె.తాయారు

సిరులిచ్చు మా తల్లి

ఆషాఢ మాసాన
బోనాల జాతర
భాగ్యనగరిలోన
ఘనమైన జాతర!!
సింహవాహినమ్మ
సిరులిచ్చు మా తల్లి
లాలు దర్వాజ కాడ
కొలువైన మాయమ్మ
అభయమీయగ మాకు
కదలి రావమ్మా!!
ముచుకుంద నదికీ
వరదలొచ్చేనంట
నిజాము నవాబు
నిన్ను కొలిచేనంట
పసుపు కుంకుమలతోటి
కొలవగా నీవు
శాంతించినావంట!!
రాజును కరుణించగ
వరదలు శాంతించగ
ఆనాటి నుండి
బోనము మొదలాయెగ!!
లష్కరూ గోల్కొండ
పాత పట్నము లోన
లాలుదర్వాజ యందు
నగర నలుమూలలందు
శ్రావణ మాసాన
పల్లె పల్లెల యందు
బోనాలు ఎత్తెదరు
నీకు మొక్కెదరు!!
పసుపు కుంకాలు పెట్టి
వేపాకు మండలు కట్టి
పచ్చి కుండలో వండి
అర్పించుటే బోనము!!
పడతులందరు జేరి
పట్టుబట్టలు కట్టి
సిగలోన పూలెట్టి
నొసట పెద్దబొట్టు
పసుపు ముఖమూ మెరువ
మెడ నిండ నిండుగా
పసిడి హారాలు
ధరియించి
తల మీద బోనముతో
తరలివత్తురు గుడికి!!
శరణు వేడిన వారిని
కరుణించు మా యమ్మ
రిబోనాలు పాయసాలు
నీకే నైవేద్యము తల్లీ!!
స్వీకరించి మమ్ముల
ఉద్ధరించగ రావ
ఓ సింహవాహినీ
మహిమ చూపుము తల్లి!!
భక్తితోడ జేరి
పసుపు కుంకుమలతో
వేపకొమ్మలతో వేడుకొందు నిత్యమ్మలి రావమ్మా!!.
పట్టుచీరా గాజులు
అమ్మకు సమర్పించి
బంగారు గద్దెపై
ఆశీనమైన
అమ్మకు నైవేద్యం!
అందుకొనుమా
మా పూజలందుకో తల్లీ!!.
కట్లు కుండ తెస్తరు
సాక నీకు పోస్తరు
శివసత్తులు రంగమెక్కి
భవిష్యత్తును చెపుతరు!!
కాశమ్మ పోశమ్మ
మమ్మేమల్లి మహాకాళి
అన్ని నీవేనమ్మ మా
సింహవాహినమ్మ!!
ఓ మహంకాళమ్మ
ఓ కనకదుర్గమ్మ
మము కాచు ఎల్లమ్మ
కానుకలు అర్పింతుము
కదలిరావమ్మా
మమ్ము బ్రోచే అమ్మ
సింహవాహినమ్మ
వెనువెంటనే నీవు

-పరిమి వెంకట సత్యమూర్తి

కన్నీటి సంద్రాలు!

ఈ ఏటి బోనాలు కన్నీటి సంద్రాలు!
ఆషాఢమాసం కుప్పలతెప్పలు
కష్టాలు కడగండ్లు!
ఉప్పొంగి పోయే నదులన్నీ!
చెల్లాచెదురాయె బతుకులన్నీ!.
సల్లంగ సూడు తల్లీ అంటూ
తరుణులంతా
నెత్తిన కుండలు కుదురుగా పెట్టి
భక్తిభావం తొణకంగ పట్టు చీరెల
రెపరెపలతో
కదిలేరు!
గ్రామదేవతల కొలిచేరు!
తెలంగాణ సంస్కృతి సంబరాలు!
అక్కన్న మాదన్నతో
గోల్కొండలో మొదలు!
పసుపు కుంకుమ పూతలు!
వేపరెమ్మల చుట్టి కుండలో
పాలు పెరుగు
బెల్లం బువ్వ నింపి
రంధ్రాల కుండలో
దీపపు కాంతుల ధగధగలతో
తరలివచ్చారు తరుణులు!.
ఉజ్జయిని మాతల్లి
బల్కంపేట ఎల్లమ్మ
పోచమ్మ కట్టమైసమ్మ
షాలిబండ ముత్యాలమ్మ
పోతరాజులు వెంట వస్తుంటే
తరలివచ్చారమ్మా !
పచ్చికుండమీద రంగం!
భవిష్యత్తు ఏమానో తెలీని
కొంపాగోడూ పోయె!
పల్లెపట్నం సంద్రమాయె!
పాణాలు అరచేతబట్టి
దిక్కుతోచని బతుకాయె!
కనికరించుతల్లీ!
కరోనా కాటుకన్నా మిన్న
జలగండంనించి
గట్టెక్కించుమాయమ్మా!.

-ఎ.రాజ్యశ్రీ

ఇలలో కనిపించే దైవం

అనిర్వచనీయమైన స్థానం
తల్లిదండ్రుల మరిపించే ప్రతిరూపం
త్రిమూర్తుల స్వరూపం
ఇలలో కనిపించే దైవం గురువు.
రాతికి రూపము నిచ్చే శిల్పిలా
అంధకారము పారద్రోలే జ్యోతిలా
అజ్ఞాన్ని తరిమేసే జ్ఞానప్రధాతలా
విజ్ఞానాన్ని పంచెడి బోధకుడిలా
మనలఉద్ధరించే అద్వైతమూర్తి గురువు,
విద్యాబుద్ధులు నేర్పే జ్ఞానవంతుడు
సకలశాస్త్రాల బోధించే తత్త్వోపదేశికుడు
సన్మార్గం చూపే ఋజువర్తనుడు
సంస్కారం లోకజ్ఞాన్నిచ్చే పరమాత్ముడు
జీవనసారం తెలిపే ఆనందస్ఫూర్తి గురువు.
వేదసారము లోకానికిచ్చిన
భారత భాగవతములనందించిన
ఆషాడ శుద్ధపౌర్ణమి నాడుదయించిన
భరతజాతిలో పరిపూర్ణమైన గురువు
ధర్మోద్ధారకుడు మహర్షి వ్యాసుడు
ఆ గురు పరనీపరకు వందనాలు..
పాదాభివందనాలు.

-మండికారి బాలాజీ

కవిత్వంలో సమాజం ప్రతిబింబించాలి - ప్రసిద్ధ సినీ గేయ రచయిత భువనచంద్ర

"కవులు రాసే కవిత్వంలో సమాజం ప్రతిబింబించేలా చూడాల్సిన బాధ్యత కవులదేనని, సామాజిక హితాన్ని ఆశించే అంశాలను వస్తువులుగా తీసుకొని కవిత్వం రాయాలని" ప్రసిద్ధ సినీ గేయ రచయిత భువనచంద్ర అన్నారు. నవీ ముంబైకి చెందిన కవయిత్రి శ్రీమతి సావిత్రి రంజోల్కర్ రచించిన"కాలం మాట్లాడుతుంది"కవితా సంపుటిని ఆదివారం రోజున ఉదయ సాహితి ఆధ్వర్యంలో జరిగిన గుగూల్ మీట్ అంతర్జాల వేదికపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కవయిత్రి సావిత్రి రంజోల్కర్ గారు అలతి పదాలతో అనంతమైన భావాల్ని అందించే ప్రయత్నం చేశారని,ప్రజలకు అర్థమయ్యే భాషలో రచించిన కవిత్వం పదికాలాలపాటు నిలుస్తుందని, వైవిధ్యమైన వస్తువులను కవిత్వాంశాలుగా తీసుకొని చక్కని కవితలను అందించారని"అన్నారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి రచయిత విమర్శకులు దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ"కాలం మాట్లాడుతుంది " గ్రంథంలో సరళత్వానికి పెద్దపీట వేశారని,కవిత్వంలో చక్కని భావుకతను ప్రదర్శించారని"అన్నారు.మరొక విశిష్ట అతిథి శ్రీదాస్యం లక్ష్మయ్య మాట్లాడుతూ"సావిత్రి రంజోల్కర్ కవిత్వం పలువురిని ఆకట్టుకుంటాయని"అభినందించారు. పత్తిపాటి రూపాలత గ్రంథ పరిచయం చేశారు.వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డా.ప్రజ్ఞ రంజోల్కర్ స్వాగత వచనాలు పలికారు.(ప్రేమ్ దాస్ రంజోల్కర్, యం.వెంకటలక్ష్మి, వకుళ వాసు,వెగ్గలం ఉషశ్రీ,స్వప్నకృష్ణ తదితరులు అభినందనలు తెలుపగా డా.అనుజ్ఞ రంజోల్కర్ వైద్య వందన సమర్పణ చేశారు.

బొమ్మల కొలువుతో 'బాపూ'కి స్మృత్యంజలి

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సారథ్యంలో జులై 22,23,24లలో

అమర చిత్రకారుడు బాపు బొమ్మల కొలువు, మహా నగరాలలో తెలుగు రాష్ట్రాలలో, మారుమూల గ్రామాలలో లండన్ వంటి విదేశీ కళా ప్రాంగణాలలో కళాభిమానులను అలరించడం శ్రీ బాపుకి స్మృత్యంజలి ఘటించడమే. ఆ మాటకొస్తే బాపూగారి ఆత్మీయులు స్వర్గీయ శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ, బాపూగార్కి అత్యంత సన్నిహిత శిష్య కళాకారుడు శ్రీ బ్నిం, ప్రముఖ రచయిత శ్రీ రమణ వంటి సన్మితులు ఎందరో ఆయన జీవిత కాలంలోనూ, నేడూ బాపు చిత్రకళా సృష్టికి జీవం అందిస్తూనే వున్నారు. 'ప్రతీ తెలుగు లోగిలి బాపూ బొమ్మల కొలువే' అన్నారు. శ్రీ రమణ, బాపూ ఎందరో రచయితలకు, ఎన్నో పత్రికలకు, టీవీ తదితర మాధ్యమ ప్రసారాలను, అసంఖ్యాక మనోహర ఘట్టాలు, లఘుచిత్రాలు, కార్యూన్‌లు,నవలల ముఖ చిత్రాలు అందించి తెలుగు ప్రేక్షక హృదయాలలో చిరస్మరణీయత సాధించారు. బాపూ బొమ్మల కొలువు తెలుగునాట, కన్నులారా వీక్షించే పండుగ సందర్భం తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణ తెలుగు సాహితీ, కళా వైభవానికి అద్దం పట్టే మహనీయ వ్యక్తిత్వ సారథ్యంలో జులై 22,23,24 తేదీలలో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బాపు బొమ్మల కొలువుకు మొదటిగా 60 ఏళ్ళు షష్టిపూర్తి వేడుక జరగనుంది. హాస్యానందం, అక్షర పబ్లికేషన్స్, తదితర ప్రచురణకర్తలు, బాపూ సన్నిహిత మిత్రులు, రచయితలు, కళాకారుల సహకారంతో ఈ బొమ్మల కొలువు మూడు రోజులు తెలుగు యూనివర్సిటీ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహిస్తున్నారు. వివరాలకు 8341450683, 8712729057, 9849630637కు సంప్రదించండి.

కొమరంభీం జిల్లా బోర్ లాల్ గూడ అడవిలో కాలమ్నార్ బసాల్ట్స్

(ప్రాకృతిక రాతిస్తంభాలు):

కొత్తతెలంగాణ చరిత్రబృందం సభ్యులు తిరుపతి గిత్తే, మిత్రబృందం కొమరంభీం-ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని బోర్ లాల్ గూడ రిజర్వ్ ఫారెస్టులో చిన్నరాళ్ళగుట్ట మీద 'కాలమ్నార్ బసాల్ట్స్' ప్రాకృతిక శిలాస్తంభాలను గుర్తించారు.

6న్నర కోట్లసం.రాల కింద భూగర్భం ఛిద్రాల నుంచి పైకెగసి ప్రవాహించి, దళసరిపొరగా, బల్లపరుపుగా పరచుకున్న లావా దక్కన్ ద్వీపకల్పభూమిలో దక్కన్ ట్రాప్స్ గా 5లక్షల చ.కి.మీ.లలో విస్తరించి పుందంటారు భూవైజ్ఞానికవేత్తలు. లావా ప్రవహించి చల్లారుతున్న సమయంలో మధ్యభారతదేశంలో, పశ్చిమభారతదేశంలో, అనేకచోట్ల లావాశిలలు వివిధరూపాలను సంతరించు కున్నాయి. వాటిని 'కాలమ్నార్ బసాల్ట్' లంటారు. ఎండాకాలంలో పంటచేండ్లలో నెర్రెలువారిన భూమి పంచకోణ, షట్కోణ, అష్టభుజాలు, బహుభుజాల ఆకారాలలో కనిపిస్తుంది. ఆ ఆకారాలే లోపలిదాకా విస్తరించి గట్టిపడి కడ్డీలవంటివి ఏర్పడతాయి. అట్లే ఈ లావా బహుళకోణ శిలారూపాలు పుట్టుకొచ్చి వుంటాయి.

భారతదేశంలో మధ్యప్రదేశ్ లో కాన్వాడ పహాడ్, పలాసి(బగ్లీ సమీపంలో), మానవార్, కోటెడలలో గుజరాత్ లో అంజర్ కచ్ లోని ధీమాధర్, మహారాష్ట్రలో అంధేరి గిల్బర్ట్ హిల్ మీద, ఇటీవల కొల్లాపూర్, ఉస్మానాబాద్, బీడ్ చించోలిలలో ఈ కాలమ్నార్ బసాల్ట్స్ లభించాయి. బోర్ లాల్ గూడ కాలమ్నార్లు చించోలి స్తంభాలను పోలివున్నాయి. ఇవి 'లావా కాలమ్స్' లేదా 'బసాల్ట్ కాలమ్స్' లేదా 'కాలమ్నార్ జాయంటెడ్ వోల్కానిక్స్'గా గుర్తించబడ్డాయి. అరేబియన్ సముద్రతీరప్రాంతంలో కర్ణాటక రాష్ట్రం ఉడుపిలోని మాల్పెలో 'కొబ్బరిచెట్లద్వీపం, ఫాన్సెపార్'లలో 'సెయింట్ మేరీ ద్వీపాలు'గా పిలువబడే 4చిన్నద్వీపాలలో ర్యోలిటిక్ లావా స్తంభరూపాలు గుర్తింప బడ్డాయి. 2016 సం.లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించిన 34 జాతీయ భూభౌతిక స్మారక కట్టడాలలో సెయింటు మేరీ ద్వీపాలు చేర్చబడ్డవి. ప్రపంచంలో అనేక దేశాల్లో ఇటువంటి భూభౌతికరూపాలు ప్రత్యేకంగా జియోటూరిజం కేంద్రాలుగా ఏర్పాటు చేయబడ్డాయి.

మా చరిత్రబృందం సలహాదారులు, భూభౌతిక విజ్ఞానవేత్త చకిలం వేణుగోపాల్ గారు, జీఎస్పై (రిటైర్డ్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్, తెలంగాణాలో ఇటువంటి శిలారూపాలు కనిపించడం ఇది రెండవసారని చెప్పారు. అపురూపమైన వీటిని పరిరక్షించి స్మారకకట్టడంగా ప్రకటించాలని కొత్తతెలంగాణ చరిత్రబృందం ప్రభుత్వాన్ని కోరుతున్నది.

2015లోనే తెలంగాణాలో తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూరు మండలంలోని శాంతిపూర్ రిజర్వ్ ఫారెస్టులో 'బసాల్ట్ శిలాస్తంభరూపాల'ను మా కొత్తతెలంగాణ చరిత్రబృందం సభ్యులు మన్నె ఏలియా మిత్రబృందం గుర్తించారు.

క్షేత్రపరిశీలన, ఫోటోగ్రఫీ: **తిరుపతి గిత్తే**-
మిత్రబృందం,9440634626,కెరిమెరి, కొత్తతెలంగాణ చరిత్రబృందం
నిపుణుల అభిప్రాయం: **చకిలం వేణుగోపాల్ గారు,** జీఎస్పై (రిటైర్డ్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్, 8284866622
-శ్రీరామోజు హరగోపాల్,
9949498698, కొత్త తెలంగాణ చరిత్రబృందం

బాలల కవితా సంకలనానికి

కవితలకు ఆహ్వానం

విశ్వసాహితీ మరియు అఖిలభారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ సంయుక్తంగా

75 సంవత్సరాల స్వాతంత్ర్య అమృతోత్సవం

పండుగ సందర్భంగా ప్రచురించదలచిన బాలల కవితా సంకలనానికి

10-15 సం॥ వయసు బాల బాలికలనుండి

కవితలకు ఆహ్వానం

- ★ కవిత **10-15 లైన్లకు** మించరాదు
- ★ పేరు, క్లాస్, ఫోన్ నంబర్ మొదలైన వివరాలు
- ★ **9618895543** వాట్సాప్ నంబరుకు పంపవలెను.

ఆఖరు తేదీ: 25-7-2022

ఆగష్టు రెండవ వారంలో ఈ కవితా సంకలనం ఆవిష్కరణ జరుగుతుంది

బాల కవులకు సర్టిఫికెట్, కవితల పుస్తకం ప్రదానం చేయడం జరుగుతుంది.

అధ్యక్షులు-కార్యవర్గ సభ్యులు
విశ్వసాహితి మరియు ఎ.బి.బి.యస్.యస్.
సాహితీ సాంస్కృతిక సంస్థలు

అందమైన బొట్టు సంస్కృతికి చక్కని మెట్టు

"అమరావతి సాహితీమిత్రులు" గ్రంథావిష్కరణ సభలో కొండా